సొమ్ము జమై.. తల్లి భారమై

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా కుక్కునూరు మండలం ఇబ్రహీం పేటకు చెందిన ఓ వృద్ధురాలి భూమిని ప్రభుత్వం తీసుకుంది. నష్టపరిహారం సొమ్మును కుమారుడి బ్యాంకు ఖాతాలో జమ చేసింది. దీంతో తనయుడు.. తల్లి బాగోగులు విస్మరించాడు. విధిలేని పరిస్థితుల్లో మంచానికే పరిమితమైన తల్లిని స్ట్రెచర్‌పై కలెక్టరేట్‌కు తీసుకొచ్చారు కుమార్తె కమలమ్మ. తన అమ్మ మంచీచెడులను సోదరుడు చూసుకునేలా చూడాలని కలెక్టర్ వెట్రిసెల్వికి వినతిపత్రం ఇచ్చారు. **- న్యూస్‌టుడే, ఏలూరు అర్బన్**

నీళ్లలో అడుగు.. నీళ్లేంటని అడుగు

జిల్లా కేంద్రం ఏలూరు కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరం ముందు చిన్నపాటి వర్షానికే నీరు నిలిచిపోతోంది. సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) నిర్వహించగా.. జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు తరలివచ్చారు. వారంతా వర్షపు నీటిలో నడిచి మీ కోసంలో వినతులు అందించాల్సి వచ్చింది. ఉన్నతాధికారులు సైతం నీటిలోనే రాకపోకలు సాగించారు. సమావేశ మందిరం ముందు వర్షపు నీరు నిలవకుండా చూడాలని అర్జీదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, ఏలూరు**

తోడేస్తూ.. తోలేస్తూ!

కృష్ణా కాలువ నుంచి యథేచ్ఛగా నీటి చౌర్యం

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే

జిల్లా కేంద్రం ఏలూరు నగరంలో పెద్దఎత్తున నీటి చౌర్యానికి పాల్పడుతున్నారు. జల వనరులను అక్రమంగా తోడేస్తున్నారు. ఇదేమిటని అడిగేవారు లేకపోవడంతో యథేచ్ఛగా దందా సాగిస్తున్నారు. కృష్ణా కాలువ నుంచి రోజూ లక్షన్నర లీటర్ల నీటిని ట్యాంకర్ల ద్వారా అక్రమంగా తరలిస్తూ రూ.లక్షల్లో వెనకేసుకుంటున్నారు.

అడ్డూఅదుపు లేకుండా.. ఏలూరు మినీ బైపాస్‌లో కృష్ణా కాలువ నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని అక్రమంగా తరలిస్తున్నారు. రోడ్డును ఆనుకొని ఉన్న కాలువలో ప్రత్యేకంగా ఓ మోటారు ఏర్పాటు చేశారు. ఒకదాని వెనుక మరొకటి చందాన ట్యాంకర్లు పెట్టి.. ఒక్కోదాంట్లో 3-4 వేల లీటర్ల నీటిని నింపుతున్నారు. ఇలా రోజుకు 50 ట్యాంకర్లలో నీరు తరలించేస్తున్నారు. ఒక్కో ట్యాంకరుకు దూరాన్ని బట్టి రూ.1,500 నుంచి రూ.2,000 వేలు వసూలు చేస్తున్నారని సమాచారం. నగరంలో పెద్దఎత్తున బహుళ అంతస్తులు, ఇళ్ల నిర్మాణ పనులు జరుగుతుండటంతో. ట్యాంకర్ల నీటికి డిమాండ్ ఏర్పడింది. ఇక్కణ్నుంచి చుట్టుపక్కల మండలాలకూ నీరు తరలిస్తున్నారు.

ఏలూరు మినీ బైపాస్‌లో కృష్ణా కాలువ నుంచి మోటారు ద్వారా ట్యాంకర్‌లోకి నీరు ఎక్కిస్తూ..

కళ్ల ముందే కనిపిస్తున్నా.. రహదారి పక్కనే మోటారు సాయంతో నీటిని తోడేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. సిబ్బంది కన్నెత్తి చూడటం లేదు. ఓ వ్యాపారి ఏకంగా ఏడెనిమిది ట్యాంకర్లు ఏర్పాటు చేసుకుని దందా సాగిస్తున్నట్లు సమాచారం. ఆయనే అందరికీ కమీషన్లు ముట్టజెబుతున్నారని, అందుకే జలవనరులు, నగరపాలక సంస్థ అధికారులు పట్టించుకోవడం లేదని తెలిసింది.

నిఘా

తేలాలి గుట్టు.. తేల్చాలి లోగుట్టు

జనన మరణాల నకిలీ ధ్రువపత్రాల విచారణ పూర్తి

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే

ఒకటి పొరపాటు.. రెండోది గ్రహపాటు.. పదేపదే కొనసాగితే అవినీతి అన్నట్లు ఏడేళ్ల కిందట ఏలూరు నగరపాలక సంస్థ జనన మరణ విభాగంలో అక్రమాలు సాగాయి. ఒకటి కాదు. . రెండు కాదు ఏకంగా 164 నకిలీ జనన మరణ ధ్రువపత్రాలు సృష్టించారు. ఈ దందాలో రూ.లక్షలు మారాయి. ఒక్కో ధ్రువపత్రానికి స్థాయిని బట్టి రూ.25 వేల నుంచి రూ.60 వేల వరకు వసూలు చేశారన్న ఆరోపణలున్నాయి. దీనిపై ఇటీవల అధికారులు పూర్తిస్థాయి విచారణ చేపట్టారు. నివేదికను కుటుంబ సంక్షేమ ప్రజారోగ్య శాఖ రాష్ట్ర కార్యాలయానికి పంపారు. అక్కడ పరిశీలనానంతరం బాధ్యులపై చర్యలు చేపట్టనున్నారు.

క్రిమినల్‌తో పాటు శాఖాపరమైన చర్యలు?.. ఈ నకిలీ ధ్రువపత్రాల కుంభకోణం 2018-19 మధ్య జరిగింది. అప్పట్లో జనన, మరణ విభాగంలో ఇద్దరు ఉద్యోగులు పని చేశారు. ప్రస్తుతం వారిద్దరూ వేర్వేరు చోట్ల విధులు నిర్వర్తిస్తున్నారు. వారిని ఇటీవల పిలిపించి దఫదఫాలుగా విచారించారు. అప్పట్లో ముగ్గురు సబ్ రిజిస్ట్రార్లుగా పని చేశారు. ప్రస్తుతం పూర్తి స్థాయి విచారణ చేపట్టిన నేపథ్యంలో.. బాధ్యులపై ఐపీసీ సెక్షన్ల ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు శాఖాపరంగానూ చర్యలు ఉండనున్నాయి. ధ్రువపత్రాలు పొందిన వారిపైనా చర్యలు తీసుకోనున్నారు.

మూడింటిపై అనుమానంతో.. అప్పట్లో మూడు ధ్రువపత్రాలపై అధికారులకు అనుమానం రావడంతో.. వాటిపై ఆరా తీశారు. జనన, మరణ విభాగాల్లో జారీ చేసిన తేదీ ఆధారంగా ఆసుపత్రిలో దస్త్రాలు పరిశీలించగా.. ఆ తేదీలో పుట్టినట్లు లేకపోవడాన్ని గమనించారు. ఆ విభాగంలో మరిన్ని దస్త్రాలు తనిఖీ చేయగా. . 145 జనన, 19 మరణ ధ్రువపత్రాలు నకిలీవని తేలింది. ఎక్కడో చనిపోతే ఇంటి వద్దే చనిపోయినట్లు ధ్రువపత్రం ఇవ్వడం, తేదీలు తారుమారు చేయడం, కుటుంబ సభ్యుల ధ్రువపత్రం లేకపోయినా.. ఇతరులకు వారసత్వ పత్రమివ్వడం, క్షేత్రస్థాయి పరిశీలన చేయకపోవడం తదితర అవకతవకలకు పాల్పడ్డారని తెలిసింది.

సిబ్బందితో అర్జీలు రాయించుకుంటున్న ప్రజలు

మీ కోసంలో వినతుల వెల్లువ

పవరుపేట(ఏలూరు కలెక్టరేట్), న్యూస్‌టుడే: స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(మీ కోసం) నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు తరలివచ్చారు. తమ సమస్యల పరిష్కారానికి కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ అభిషేక్ గౌడ, సహాయ కలెక్టర్ శ్రావణ్ కుమార్‌రెడ్డి, జిల్లా అటవీ శాఖాధికారి సందీప్‌రెడ్డి, డీఆర్వో ఎం.శ్రీదేవి, ఇతర అధికారులకు అర్జీలు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మొత్తం 403 వినతులు అందాయని చెప్పారు. ఆయా అర్జీలను ప్రాధాన్య క్రమంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

లేదు పండేలా.. ఉంది ఎండేలా..

శివారు ప్రాంతాల్లో వరికి నీటి కష్టాలు

ఈనాడు-ఏలూరు

ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో ప్రధానంగా కృష్ణా డెల్టా శివారు ఆయకట్టు, వెద పద్ధతిలో వరిసాగుకు ఉపక్రమించిన రైతుల్లో ఆందోళన నెలకొంది. కళ్ల ముందే చేలు ఎండిపోతుండటంతో వారి గుండె బరువెక్కుతోంది. పలు చోట్ల భూములకు నెర్రలివ్వడం కనిపిస్తోంది. ముదినేపల్లి మండలం మినహా జిల్లా వ్యాప్తంగా లోటు వర్షపాతం నమోదైంది. కొన్ని రోజులుగా వర్షం కురవక ముదినేపల్లి ప్రాంతంలో వెద పద్ధతిలో సాగు చేసిన వరి అక్కడక్కడా ఎండిపోవడంతో గేదెలను మేపుతున్నారు.

దేవపూడి: చేలో గేదెలు మేపుతున్న రైతు

నీరు లేక నెర్రెలిచ్చిన నేల

ఇటు గోదావరి, అటు కృష్ణా డెల్టాకు ఏలూరు, పెదపాడు మండలాలు శివారు ప్రాంతాలు. గుడ్లవల్లేరు రైవస్, పోలురాజు, కాంబెల్ కాలువకు ముదినేపల్లి, కైకలూరు, కలిదిండి, మండవల్లి మండలాలు శివారున ఉంటాయి.

పట్టిసీమ నుంచి కాలువలకు వస్తున్న నీటిని ఎక్కడికక్కడ ఎగువ ప్రాంత రైతులు మోటార్లతో మళ్లిస్తున్నారు. పర్యవసానంగా శివారు ఆయకట్టుకు చుక్కనీరు వెళ్లక వరి చేలు ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు.

తీవ్ర నష్టమని ఆందోళన.. కైకలూరు నియోజకవర్గంలో సుమారు 7-8 వేల ఎకరాల్లో వెద పద్ధతిలో వరి సాగు చేశారు. అదేవిధంగా మెట్ట ప్రాంతం చాట్రాయి, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, ముసునూరు తదితర ప్రాంతాల్లో బోర్ల కింద సాగైన పంట దక్కే సూచనలు కనిపించడం లేదు. ఇక తమ ఆశలన్నీ పంటల బీమాపైనేనని రైతులు అంటున్నారు.

ఈ రైతు పేరు చలమయ్య. ముదినేపల్లి మండలం దేవపూడి. రెండు ఎకరాల్లో వెద పద్ధతిలో వరి వేసి ఇప్పటికే రూ.20 వేల వరకు పెట్టుబడి పెట్టారు. వర్షాలు పడక, కాలువల ద్వారా నీళ్లు రాక చేను ఎండిపోతోంది. కాలువల్లో మోటార్లు పెట్టి నీళ్లు తోడేస్తున్న వారిని కట్టడి చేసి శివారు ఆయకట్టుకు ఇవ్వాలని కోరుతున్నారు.

వెంటిలేటర్‌పై ఉంచారు

- స్టోర్ రూమ్‌లో కొత్త యంత్రాలు
- వాడకుండానే పాడైపోయాయ్

ఈనాడు-ఏలూరు: కొవిడ్ సమయంలో కేంద్రం రాష్ట్రంలోని బోధనాసుపత్రులు, జిల్లా ఆసుపత్రులకు వెంటిలేటర్లు పంపింది. జిల్లా బోధనాసుపత్రికి 15 రాగా వాటిలో అయిదే వినియోగిస్తున్నారు. మిగిలిన 10 వినియోగంలోకి రాకుండానే అటకెక్కాయి.

ఆసుపత్రికి సగటున రోజుకు 10-12 వరకు అత్యవసర కేసులు వస్తాయి. వాటిలో రహదారి ప్రమాదాల్లో తీవ్ర గాయాల పాలైన క్షతగాత్రులే ఎక్కువగా ఉంటారు. మన్యం, మెట్ట ప్రాంతాల నుంచి అత్యవసర కేసులు వస్తాయి.

ఇవి ఖరీదైన వెంటిలేటర్లు. ఒక్కో దాని ధర రూ.10 లక్షల పైనే. వాటిని ప్రస్తుతం స్టోర్ గదిలో మూలన పడేశారు. దుమ్ము, ధూళి పడుతున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటికే కొన్ని స్పేర్ పార్ట్స్ దెబ్బతిన్నాయి. పాడవకుండా ఉన్న స్పేర్‌పార్ట్స్ తీసి ఇతర వెంటిలేటర్లకు అమర్చాలని తాజాగా నిర్ణయం తీసుకున్నారు.

వెంటిలేటర్ అనేది రోగికి ప్రాణం పోస్తుంది. అందుకే దీన్ని లైఫ్ సేవింగ్ యంత్రంగా భావిస్తారు. ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో వెంటిలేటర్‌పై ఉంచితే రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు తీసుకుంటారు. ఇంత ఖరీదైన వైద్యం బోధనాసుపత్రిలో అందించే అవకాశమున్నా ఆ యంత్రాలను వినియోగంలోకి తేకుండా మూలన పెట్టేయడంతో అత్యవసర వైద్యం అవసరమైన వారిని ప్రైవేటు ఆసుపత్రుల్లో చేర్పుతున్నారు. ఏలూరు జీజీహెచ్ నుంచి ఇప్పటికీ అంబులెన్సుల్లో రోజుకు సగటున ఐదారు కేసులను అత్యవసర వైద్యం పేరుతో విజయవాడకు రిఫర్ చేస్తున్నారు. దీనిపై ఆసుపత్రి వర్గాలను సంప్రదించగా 'వెంటిలేటర్లు చాలా వరకు పనిచేయడం లేదు. వాటిల్లో పాడవకుండా ఉన్న కంప్రెషర్లు తీసి ఇతర వెంటిలేటర్లకు అటాచ్ చేసి వినియోగంలోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నాం' అని చెప్పారు. ప్రస్తుతం 20 వరకు పనిచేస్తున్నాయని, మరో 10-15 అవసరమని ప్రతిపాదనలు పంపామన్నారు.

అంతా సిద్ధం

ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం నియోజకవర్గంలో మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటనకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. కలెక్టర్ నాగరాణి, కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. హెలిప్యాడ్ నిర్మాణం పూర్తయింది. క్యాడర్ సమావేశం, ప్రజా వేదికలను సిద్ధం చేశారు. ఆయన పర్యటనలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా, అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

సిద్ధమైన ప్రజావేదిక

అధికారుల పరిశీలన.. పోలీసు శాఖ ఐజీ జీవీఆర్ అశోక్‌కుమార్, కలెక్టర్ నాగరాణి, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, జేసీ కేఆర్ కల్పశ్రీ తదితరులతో కలిసి పట్టణంలోని పొన్నపల్లి, ప్రధాన కూడళ్లు, మొగల్తూరులలో పర్యటించారు. ముఖ్యమంత్రి గోదావరిలో బోటులో ప్రయాణించనున్న ప్రాంతాన్ని పడవపై వెళ్లి పరిశీలించారు. సీఎం రోడ్డు షో చేసేందుకు అవసరమైన వాహన శ్రేణిని సిద్ధంగా ఉంచారు. నియోజకవర్గంలో సుమారు 1500 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. మొగల్తూరులో వేదికల వద్ద, ప్రధాన కూడళ్లు, అక్కడి నుంచి నరసాపురం పట్టణం వరకూ పట్టణంలో ఉన్న ప్రధాన కూడళ్లు, పొన్నపల్లి, గోదావరి రేవుల వద్ద బందోబస్తుకు పోలీసులను నియమించారు.

నేడు పింఛన్ల పంపిణీ

పవరుపేట(ఏలూరు కలెక్టరేట్), న్యూస్‌టుడే: జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద మంగళవారం సామాజిక పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. మొత్తం 2,53,845 మంది లబ్ధిదారులకు రూ. 111.60 కోట్లు అందజేయనున్నట్లు చెప్పారు. ఉదయం 7 గంటలకు ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఇందుకు 4,932 మంది సచివాలయ, ఇతర శాఖల సిబ్బందిని కేటాయించినట్లు వివరించారు.

అటవీ దారులకు నిబంధనాలు

మూడేళ్లవుతున్నా కదలని పనులు

మెత్తప్పకోట రహదారి దుస్థితి

బుట్టాయగూడెం, పోలవరం, న్యూస్‌టుడే: మన్యంలో రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా.. అటవీ శాఖ నిబంధనల పేరుతో అనుమతులు ఇవ్వకపోవడంతో పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో మారుమూల గ్రామాల్లోని ఆదివాసీ గిరిజనులు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అత్యవసర వైద్యానికి ఆసుపత్రికి వెళ్లేందుకు ప్రాణసంకటం అవుతోంది.

పీఎం జన్‌మన్ యోజన కింద పనులు మంజూరయ్యాయి. అనుమతులు రాక మూడేళ్లుగా పనుల్లో కదలిక లేదు.

- కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలో బుట్టాయగూడెం మండలం గురుగుమిల్లి నుంచి గొట్టాలరేవు మీదుగా పూచికగొంది వరకు 6 కి.మీ మేర సుమారు రూ.3.50 కోట్లు.
- రెడ్డికోపల్లి నుంచి వీరన్నపాలెం వరకు 4 కి.మీ మేర రూ.4.05 కోట్లు.
- రామనర్సాపురం (గుమ్ములూరు) 5.7 కి.మీ మేర రూ.4.13 కోట్లు.
- పోలవరం మండలం వింజరం నుంచి ఉడతపల్లి వరకు 5.5 కి.మీ మేర రూ.82 లక్షలు.
- మెత్తప్పకోటకు 3 కి.మీ మేర రూ.40 లక్షల అంచనాతో తారు రోడ్లు మంజూరయ్యాయి.
- పనులు చేపట్టిన కొన్ని రోజులకే అటవీ శాఖ అధికారులు నిబంధనల పేరుతో అభ్యంతరాలు చెప్పి నిలిపివేశారు.

రామనర్సాపురం రహదారి

నిధులు వెనక్కి..

లంకపాకల నుంచి రేగులపాడుకు తారురోడ్డు నిర్మాణానికి రూ. 3.50 కోట్లు మంజూరు కావడంతో గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ విభాగం పర్యవేక్షణలో చేపట్టారు. కొంతమేర నిర్మించాక అటవీ ప్రదేశంలోకి వచ్చే పనులను ఆ శాఖ అధికారులు అడ్డుకున్నారు. తర్వాత గతేడాది నవంబరులో అనుమతి ఇచ్చారు. అప్పటికి ఆ పనులు రద్దయి నిధులు వెనక్కి మళ్లాయి. అటవీ శాఖ ఇచ్చిన అనుమతులకు ఏడాది మాత్రమే గడువు ఉంటుందని చెబుతున్నారు.

గృహ నిర్మాణాలకు నిరీక్షణ

బుట్టాయగూడెం, వేలేరుపాడు మండలాల సరిహద్దున అటవీ ప్రదేశంలో ఉన్న మోదెల గ్రామానికి పీఎం జన్‌మన్ పథకం కింద 20 గృహాలు మంజూరయ్యాయి. వాటి నిర్మాణ పనులను అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నారు. ఇది కొండరెడ్డి తెగ గిరిజనుల నివాసిత గ్రామం. అనుమతుల కోసం లబ్ధిదారులకు రెండేళ్లుగా ఎదురుచూపులు తప్పడం లేదు. ఈ గ్రామానికి సరైన రహదారి లేదు. విద్యుత్తు సదుపాయం కోసం మూడేళ్ల కిందట లైన్ వేసే పనులనూ అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నారు.

అనుమతుల సాధనకు కృషి

'రహదారుల నిర్మాణానికి హెక్టార్ లోపు పరిధికి జాప్యం లేకుండా డీఎఫ్‌వో అనుమతులు ఇస్తున్నారు. ఆ పరిధి దాటితే ఫారెస్ట్ కన్జర్వేషన్ యాక్టు కింద దిల్లీకి ఆన్‌లైన్ ద్వారా పోర్టల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. కొన్నింటికి ఇది పూర్తయ్యింది' అని అటవీ శాఖ జంగారెడ్డిగూడెం సబ్ డీఎఫ్‌వో వెంకట సుబ్బయ్య, రేంజర్ దుర్గాకుమార్‌బాబులు తెలిపారు.

కళ్లు దానం చేద్దాం.. మరొకరికి చూపునిద్దాం

జాతీయ నేత్ర దాన పక్షోత్సవాల సందర్భంగా.. ఏలూరు సర్వజన ఆసుపత్రి నుంచి అగ్నిమాపక కేంద్రం కూడలి వరకు నర్సింగ్ విద్యార్థినులు, వైద్యాధికారులు, వైద్యులు అవగాహన ప్రదర్శన చేపట్టారు. వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో విద్యార్థినులు ప్లకార్డులు చేతబట్టి నినాదాలు చేశారు. నేత్రదానాన్ని సామాజిక బాధ్యతగా తీసుకొని.. మరొకరికి చూపు ప్రసాదిద్దామని ఆసుపత్రి పర్యవేక్షకురాలు శ్యామల సూచించారు. **- న్యూస్‌టుడే, ఏలూరు టూటౌన్**

మాకూ ఓటు కావాలి

కొత్తగా 6,369 దరఖాస్తులు

ఈనాడు-ఏలూరు: జిల్లాలో ఓటుహక్కు కోసం కొత్తగా 6,369 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో 1,357 మంది దరఖాస్తుల విచారణ పెండింగ్‌లో ఉండగా 45 రోజులైనా విచారణకు నోచుకోనివి 147 ఉన్నాయి. ఇన్ని రోజులు ఎందుకు ఉంచారు? విచారణలో మీకున్న ఇబ్బందులు ఏమిటని కలెక్టర్ వెట్రిసెల్వి పీజీఆర్ఎస్‌లోనే బాధ్యులైన తహసీల్దార్లను సోమవారం ప్రశ్నించారు. కొత్త ఓటర్ల నమోదు, విచారణలు, సర్ అభ్యంతరాలు, క్లెయిమ్‌ల పరిష్కారం విషయంలో అలసత్వం వహిస్తే ఊరుకునేది లేదని, బాధ్యులపై తీవ్రమైన చర్యలకు సిఫార్సు చేస్తానని హెచ్చరించారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా వచ్చిన క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ గడువు ముగిసింది. డబుల్ ఓట్లు, మృత ఓట్లు పక్కాగా తొలగించాలని, ప్రతి ఓటు తొలగింపునకు సరైన ఆధారాలు ఉండాలని కలెక్టర్ సూచించారు. అనర్హుల పేర్లు తొలగించడానికి ఫారం-7లో 225 దరఖాస్తులు రాగా ఇంకా 97 పెండింగ్‌లో ఉన్నాయి. అదేవిధంగా చిరునామాలు, పేర్లు, ఫోన్ నంబర్లు మార్పు, చేర్పులు, ఇతరత్రా తప్పులు సరిదిద్దుకునేందుకు ఫారం-8కు సంబంధించి 3,514 వచ్చాయి. వాటిల్లో 987 దరఖాస్తులు పెండింగ్ ఉన్నాయి.

నియోజకవర్గాల వారీగా దరఖాస్తులు

నూజివీడు	ఉంగుటూరు	దెందులూరు	ఏలూరు	పోలవరం	చింతలపూడి	కైకలూరు
1,407	645	1070	696	720	837	994

అసంతృప్తి.. జంగారెడ్డిగూడెం, నూజివీడు డివిజన్లలోని కొందరు తహసీల్దార్లు ఎన్నికల విధులను సక్రమంగా నిర్వహించడం లేదని, ఎన్నికల రిటర్నింగ్ అధికారులైన ఆర్డీవోలు పట్టించుకోవడం లేదన్నారు. వారిపై కూడా కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. రానున్న ఒకటి రోజుల్లో పెండింగ్ తగ్గించాలని ఆదేశించారు. అదే సమయంలో ఒక్క అర్హమైన ఓటు తొలగించరాదని సూచించారు.

వినాయక చవితిని ప్రశాంతంగా జరుపుకొందాం: ఎస్పీ

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: వినాయక చవితిని ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో జరుపుకొందామని ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ. . జిల్లా వ్యాప్తంగా 30 పోలీసు చట్టం అమల్లో ఉంటుందన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని, ఆర్నెల్లు జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. తొలుత పోలీసుల అనుమతి తీసుకున్నాకే.. మండపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్డుపై అడ్డు లేకుండా, ట్రాఫిక్ ఇబ్బందులు కలిగించకుండా మండపాలు నిర్మించాలన్నారు.

పులి ఎక్కడుందో

పోలవరం, న్యూస్‌టుడే: నాలుగు రోజులుగా ప్రాజెక్టు పరిసరాల్లో తిరుగుతున్న పెద్దపులి జాడ సోమవారం కానరాక అటవీ శాఖ అధికారులు ఆందోళన చెందుతున్నారు. పాతమామిడిగొంది సమీపంలో స్పిల్‌ఛానల్‌ను అనుకుని ఉన్న 902 కొండపై ఆదివారం అర్ధరాత్రి పెద్దపులి ఉన్నట్లు ట్రాకర్ ద్వారా గుర్తించిన అటవీ శాఖ అధికారులు వెంటనే అక్కడకు బయలుదేరి వెళ్లారు. కొండను చుట్టుముట్టి పులి కోసం ఘాటర్‌లతో గాలించగా అప్పటికే రోడ్డు దాటి పక్కన ఉన్న కొండల్లోకి వెళ్లిపోయినట్లు పోలవరం అటవీశాఖ అధికారి ఎస్కే. వలీ చెప్పారు. ఇక అప్పటి నుంచి పులికి ఉన్న రేడియో కాలర్ ద్వారా ట్రాకర్‌కు వచ్చే సిగ్నళ్లు నిలిచిపోయినట్లు అటవీశాఖ అధికారి చెప్పారు. ఘాటర్‌లతోపాటు వెటర్నరీ, ప్రత్యేక బృందాలు ఉదయం పోలవరం రేంజ్ కార్యాలయానికి చేరుకుని తర్జన భర్జన పడ్డారు. మధ్యాహ్నం జంగారెడ్డిగూడెం సబ్ డీఎఫ్‌వో వెంకటసుబ్బయ్య పోలవరం వచ్చి పులిని పట్టుకునేందుకు వచ్చిన బృందాలతో పాటు అటవీ శాఖ సిబ్బందితో సమీక్షించారు. సాయంత్రం వారంతా రెండు బృందాలుగా విడిపోయారు. పి.రెగ్యులేటర్ సమీపంలో పెద్దపులి ఆవు, గేదె దూడను చంపిన ప్రాంతానికి , ఇటుకల కోట వైపు ట్రాకర్‌లు పట్టుకుని గాలింపు చర్యలు ప్రారంభించారు.

మామిడిగొంది సమీపంలోని 902 కొండ

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 80080 12494

ICAR - INDIAN INSTITUTE OF OIL PALM RESEARCH
(D.A.R.E, Ministry of Agriculture & Farmer's Welfare, Govt.of India)
PEDAVEGI - 534 450
Eluru District, Andhra Pradesh, India

WALK-IN-INTERVIEW

Applications are invited from eligible candidates for engagement to the temporary positions of **Pollen Collector-cum-Pollinator, Assistant Pollinator-cum-Harvester and Data Analyst (IT) at ICAR-Indian Institute of Oil Palm Research (ICAR-IIOPR), Pedavegi.**

Pollen Collector-cum-Pollinator, Assistant Pollinator-cum-Harvester: Walk-in-Interview at **10:00A.M on 09.09.2026**

Data Analyst (IT): Written Test followed by Walk-in-Interview at **01:00 P.M on 09.09.2026**

For detailed eligibility criteria, terms & conditions and other details, please visit: https://iiopr.org.in/en/opportunities

Sd/- **Administrative Officer**

(c) eenadu

12న మెగా ఉద్యోగ మేళా

పవరుపేట(ఏలూరు కలెక్టరేట్), న్యూస్‌టుడే: జిల్లాలో నిరుద్యోగ యువత సౌకర్యార్థం ఈ నెల 12న మెగా ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో మేళా ఏర్పాట్లపై జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జితేంద్ర బాబుతో సోమవారం ఆమె చర్చించారు. చిత్తూరు జిల్లాకు చెందిన గ్రీన్‌టెక్ ఇండియా ప్రైవేటు సంస్థలో 800 మెషీన్ ఆపరేటర్ ఉద్యోగాల భర్తీకి మేళా జరుగుతుందన్నారు. స్వర్ణ/ వార్డు శాఖ కౌశలం కార్యక్రమం ద్వారా నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణులైన 2,303 మందితోపాటు అర్హత కలిగిన నిరుద్యోగులు హాజరు కావచ్చని ఆమె పేర్కొన్నారు.

ఉడకని అన్నం.. రుచించని కూరలు

బాలల హక్కుల కమిషన్ సభ్యుడి దృష్టికి సమస్యలు

విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న గాంధీబాబు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: గురుకులాలు, పాఠశాలల్లో విద్యార్థులతో మెస్ కమిటీలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు వి.గాంధీబాబు కోరారు. జంగారెడ్డిగూడెంలో సోమవారం సాయంత్రం పర్యటించిన ఆయన స్థానిక ఎస్సీ బాలికల గురుకులం, జడ్పీ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా మెనూ, పాఠ్యాంశాల బోధన, ఇతర మౌలిక సమస్యలకు సంబంధించి విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పేపర్లపై రాయించారు. గురుకులంలో ఉన్న పలు సమస్యలు తన దృష్టికి వచ్చాయని గాంధీబాబు చెప్పారు. ఇక్కడ ప్రధానంగా పిల్లల్లో రక్తహీనత ఉందన్నారు. తెలుగు పాఠాలు అర్థం కావడం లేదని కొందరు రాశారన్నారు. మరుగుదొడ్లు ఉన్నా.. శుభ్రత సరిగా లేక పిల్లలు ఇబ్బంది పడుతున్నారన్నారు. సీనియర్స్ కొందరు ర్యాగింగ్ తరహాలో ఇబ్బంది పెడుతున్నారని జూనియర్లు లేఖ ద్వారా తన దృష్టికి తెచ్చారన్నారు.

వండింది 40 కిలోలే.. ఎస్సీ బాలికల గురుకులంలో సోమవారం రాత్రి భోజనంలో 50 కిలోలు బెండకాయలు వండాలి. కానీ 40 కిలోలే వండారు. దీని వల్ల పిల్లలకు కూర తగ్గుతుంది. ఇక్కడి వంట గదిని పరిశీలించిన సమయంలో ఈ విషయం తన దృష్టికి వచ్చిందని గాంధీబాబు చెప్పారు. తగ్గిన కూరగాయలకు బదులు టమోటాలు వేస్తామని ఉపాధ్యాయినులు చెబుతున్నారన్నారు. దీని వల్ల పిల్లలకు నష్టం కలుగుతుందన్నారు. ఇక్కడ గుర్తించిన అన్ని విషయాలను జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామని ఆయన పేర్కొన్నారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల ఇబ్బందితో పాటు అన్నం ఉడకడం లేదని, రుచిగా ఉండని విషయం తన దృష్టికి వచ్చిందని చెప్పారు. జిల్లా బాలల సంరక్షణాధికారిణి సూర్యచక్రవేణి, జంగారెడ్డిగూడెం ఐసీడీఎస్ పీవో పి.బ్యూల, ఎంఈవోలు బి.రాముడు, రాములు పాల్గొన్నారు.

అంతర సేద్యం.. జీవామృతం..

రైతేరాజు

సత్ఫలితాలు సాధిస్తున్న గిరిజన యువతి

జీడిమామిడి తోటలో కూరగాయల సాగు

వెంకటలక్ష్మి

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: డిగ్రీ పూర్తి చేసి.. ఉద్యోగం కోసం సమయం వృథా చేయకుండా సాగుపై మక్కువతో పొలం బాట పట్టారు.. బుట్టాయగూడెం మండలం కన్నారప్పాడుకు చెందిన కొండరెడ్డి తెగ గిరిజన యువతి చెదల వెంకటలక్ష్మి. తండ్రిని కోల్పోయిన ఆమె వ్యవసాయం చేస్తూ కుటుంబానికి ఆదరువయ్యారు. జీడిమామిడి తోటలో అంతర పంటలుగా మినుము, కంది పంటల సాగుతో పాటు, కూరగాయలు పండిస్తూ ఆదాయం పొందుతున్నారు. వెంకటలక్ష్మి కుటుంబానికి ఎకరం పొలం ఉంది. ఆ భూమిలో తండ్రి లచ్చిరెడ్డి జీడిమామిడి తోటను సాగు చేస్తూ వచ్చారు. అరకొర దిగుబడితో తండ్రి ఇబ్బందులు పడటాన్ని చూసిన ఆమె సాగులో సహకరించేవారు. బీఏ పూర్తి చేసిన తర్వాత నాలుగేళ్లుగా తానే స్వయంగా వ్యవసాయం చేస్తున్నారు. తమకున్న జీడిమామిడి తోటలో అంతర పంటలు వేసి ఆదాయం సాధించవచ్చని గుర్తించారు. సేంద్రియ వ్యవసాయ విధానాన్ని అవలంబిస్తూ సత్ఫలితాలు సాధిస్తున్నారు. తండ్రి ఏడాది కిందట అనారోగ్యంతో చనిపోయారు. దీంతో తల్లి, తమ్ముడు, చెల్లి ఆలనాపాలనా చూసుకుంటూ ఆమె ఆధారంగా ఉన్నారు.

ఆరు క్వింటాళ్ల వరకు దిగుబడి

ఎకరం భూమిలో పెంచుతున్న జీడిమామిడి తోటకు కూలీలు, పోషక ఎరువుల కోసం ఏటా సుమారు రూ.5 వేల వరకు పెట్టుబడి పెడుతున్నారు. ఆరు క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోంది. పంటను అమ్మగా రూ.50 వేలకు పైగా ఆదాయం లభిస్తుందని ఆమె తెలిపారు. ఇదే తోటలో అంతర పంటలుగా మినుము, కంది పంటలను సాగు చేస్తున్నారు. సుమారు రూ.2 వేలు ఖర్చు అవుతుంది. రూ.15 వేలు మిగులుతుందని వివరించారు. ఈ రెండు పంటలు పూర్తయ్యాక ఏటీఎం విధానంలో ఆకు, తీగ, తదితర రకాల కూరగాయలు సాగు చేస్తున్నారు. అందుకు రూ.వెయ్యి మాత్రమే ఖర్చు అవుతుందని, నిరంతరం ఆదాయం వస్తుందని చెప్పారు. వ్యవసాయానికి అవసరమైన కషాయాలు, పంచగవ్య, జీవామృతం తదితరాలను సొంతంగా తయారు చేసుకుంటున్నామన్నారు. 'బీఏ పూర్తయ్యాక ఆర్థిక స్తోమత లేక చదువు ఆపేశా. నాన్నకు తోడ్పడ్డా. కొద్ది రోజులు మా గ్రామంలోని పాఠశాలలో విద్యా వాలంటీరుగా కూడా పనిచేశా. నాన్న చనిపోయాక సొంత భూమి ఉండటంతో వ్యవసాయం చేస్తున్నా. దాంతో పాటు ప్రకృతి వ్యవసాయ విభాగంలో స్థానికంగా ఐసీఆర్‌పీగా పని చేస్తూ మా చుట్టుపక్కల గ్రామాల వారికి సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నా' అని వెంకటలక్ష్మి తెలిపారు.

డెట్స్ రికవరీ అపిలేట్ ట్రిబ్యునల్ సమక్షంలో, కోల్‌కతా వద్ద
9, పాత పోస్ట్ ఆఫీస్ వీధి, 7వ అంతస్తు, కోల్‌కతా-700001.

రెగ్యులర్ అపీలు డివై.నెం.585/ 2026
(గౌరవనీయ డెట్స్ రికవరీ ట్రిబ్యునల్-II, హైదరాబాద్‌వారిచే స్థాన భ్రంశం చేయబడిన 12-5-2023 తేదీనాటి ఉత్తర్వు ద్వారా ఒ.ఎ.నెం.3657/2017 నుండి ఉత్పన్నమైనది)
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ....అపీలుదారులు
వర్సెస్
మెసర్స్ మెహర్ కిరణ్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ మరియు ఇతరులు ....ప్రతివాదులు
టు:
1. మెసర్స్ మెహర్ కిరణ్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్, ప్రాతినిధ్యం వహిస్తున్న దీని మేనేజింగ్ డైరెక్టర్ **శ్రీమతి కె.సునైనా రాజు,** ఇంటి నెం.8-2-893/82/27777, ప్లాట్ నెం.277, ఎంఎల్ఎ అండ్ ఎంపి కాలనీ, జూబ్లీ హిల్స్, హైదరాబాద్- 500033. **2. శ్రీమతి కె.సునైనా రాజు** భర్త శ్రీ సతీష్ కుమార్, వయస్సు: మేజర్, ప్లాట్ నెం.494/ఎ, రోడ్ నెం.22, జూబ్లీ హిల్స్, హైదరాబాద్- 500033. **3. శ్రీ కంటిపూడి శ్రీనివాస చౌదరి** తండ్రి కె.వి.ఆర్. చౌదరి, వయస్సు: మేజర్, ఫ్లాట్ నెం.1003, బ్లాక్ నెం.5, హిల్స్ రిడ్జ్ స్ప్రింగ్స్ ఐవిఆర్‌సిఎల్ అపార్ట్‌మెంట్స్, గచ్చిబౌలి, హైదరాబాద్-500053. **4. ఎంఎస్. సత్యవతి రాజు భర్త రుద్రరాజు వెంకటరాజు,** వయస్సు: మేజర్, ప్లాట్ నెం.494/ఎ, రోడ్ నెం.22, జూబ్లీ హిల్స్, హైదరాబాద్- 500033. **5. శ్రీ కె.నరసింహరాజు తండ్రి కలిదిండి సుబ్బరాజు,** వయస్సు: మేజర్, ఇంటి నెం.25-1-23, సుబ్బరాజు భవన్ విజయ్ కుమార్ సెంటర్, ఎన్.ఆర్.పేట, ఏలూరు. **6. మెసర్స్ ప్రొపెల్ టెక్నాలజీస్ లిమిటెడ్,** ప్రాతినిధ్యం వహిస్తున్న దీని డైరెక్టర్ **శ్రీ కె.శ్రీనివాస చౌదరి,** ప్లాట్ నెం.165, ప్రశాసన్‌నగర్, జూబ్లీ హిల్స్, హైదరాబాద్.

సమన్లు
అపీలుదారు గౌరవనీయ ప్రిసైడింగ్ అధికారి, డెట్స్ రికవరీ ట్రిబ్యునల్-II, హైదరాబాద్‌వారిచే జారీచేయబడిన 12-5-2023 తేదీనాటి ఉత్తర్వు మీద రికవరీ ఆఫ్ డెట్స్ అండ్ బ్యాంక్‌రప్సీ యాక్ట్, 1993 లోని సెక్షన్ 20 క్రింద మెమోరాండం ఆఫ్ అపీల్‌ను దాఖలు చేశారు. మరియు ఇతర పరిహారాలను కోరారు. సదరు విషయం గౌరవనీయ ఛైర్‌పర్సన్ సమక్షంలో ఉంచబడినందున మీరు 9-10-2026న ఉ.10.30 గం.లకు ఈ ట్రిబ్యునల్ సమక్షంలో హాజరు కావల్సిందిగా మీకు ఇందుమూలముగా సమను ఇవ్వడమైనది. ఐఎ/395/2026 ను వ్యతిరేకించుటకు మీవద్ద ఏదేని ఉంటే, ఈ సమను ప్రచురణ తేది నుండి మూడు వారాల్లోగా అపీలుదారుకు ఒక కాపీతో దాఖలు చేయవల్సిందిగా మిమ్మల్ని ఇంకను ఆదేశించడమైనది. 2. మీరు ఏవేని డాక్యుమెంట్లను దాఖలు చేయదల్చినచో, వ్యతిరేకతతోపాటు ఒక జాబితాతో వాటిని దాఖలు చేయవచ్చును. 3. మీరు స్వయంగాగాని లేదా తగువిధంగా సూచించబడిన న్యాయవాది/అడ్వొకేట్ ద్వారా గాని ట్రిబ్యునల్ సమక్షంలో హాజరగునప్పుడు మీ నమోదిత చిరునామాతోపాటు ఇమెయిల్‌ఐడి, మొబైల్ నెంబరు మరియు హాజరు యొక్క మెమోను దాఖలు చేయవలెను. 4. ఇందులో తెలిపిన తేదీన మీరు హాజరుకాని పక్షంలో, సదరు ప్రొసీడింగ్ మీ పరోక్షంలో విచారించబడుతుంది మరియు నిర్ణయించబడుతుందని గమనించగలరు.
ఈ ట్రిబ్యునల్ యొక్క అధికారిక ముద్ర మరియు నా చేవ్రాలుతో **28 ఆగస్టు 2026** న ఇవ్వబడినది.
సమన్లు జారీచేయు అధీకృత అధికారి సంతకం

డెట్స్ రికవరీ అపిలేట్ ట్రిబ్యునల్ సమక్షంలో, కోల్‌కతా వద్ద
9, పాత పోస్ట్ ఆఫీస్ వీధి, 7వ అంతస్తు, కోల్‌కతా-700001.

రెగ్యులర్ అపీలు డివై.నెం.589/ 2026
(గౌరవనీయ డెట్స్ రికవరీ ట్రిబ్యునల్-II, హైదరాబాద్‌వారిచే తిరస్కరించబడిన 22-4-2025 తేదీనాటి ఉత్తర్వు ద్వారా ఒ.ఎ.నెం.3657/2017 లోని రెవిర్ నెం.861/2023 నుండి ఉత్పన్నమైనది)
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా .... అపీలుదారులు
వర్సెస్
మెసర్స్ మెహర్ కిరణ్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ మరియు ఇతరులు .... ప్రతివాదులు
టు:
1. మెసర్స్ మెహర్ కిరణ్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్, ప్రాతినిధ్యం వహిస్తున్న దీని మేనేజింగ్ డైరెక్టర్ **శ్రీమతి కె.సునైనా రాజు,** ఇంటి నెం.8-2-893/82/27777, ప్లాట్ నెం.277, ఎంఎల్ఎ అండ్ ఎంపి కాలని, జూబ్లీ హిల్స్, హైదరాబాద్- 500033. **2. శ్రీమతి కె.సునైనా రాజు** భర్త శ్రీ సతీష్ కుమార్, వయస్సు: మేజర్, ప్లాట్ నెం.494/ఎ, రోడ్ నెం.22, జూబ్లీ హిల్స్, హైదరాబాద్- 500033. **3. శ్రీ కంటిపూడి శ్రీనివాస చౌదరి** తండ్రి కె.వి.ఆర్. చౌదరి, వయస్సు: మేజర్, ఫ్లాట్ నెం.1003, బ్లాక్ నెం.5, హిల్స్ రిడ్జ్ స్ప్రింగ్స్ ఐవిఆర్‌సిఎల్ అపార్ట్‌మెంట్స్, గచ్చిబౌలి, హైదరాబాద్-500053. **4. ఎంఎస్. సత్యవతి రాజు భర్త రుద్రరాజు వెంకటరాజు,** వయస్సు: మేజర్, ప్లాట్ నెం.494/ఎ, రోడ్ నెం.22, జూబ్లీ హిల్స్, హైదరాబాద్- 500033. **5. శ్రీ కె.నరసింహరాజు తండ్రి కలిదిండి సుబ్బరాజు,** వయస్సు: మేజర్, ఇంటి నెం.25-1-23, సుబ్బరాజు భవన్ విజయ్ కుమార్ సెంటర్, ఎన్.ఆర్.పేట, ఏలూరు. **6. మెసర్స్ ప్రొపెల్ టెక్నాలజీస్ లిమిటెడ్,** ప్రాతినిధ్యం వహిస్తున్న దీని డైరెక్టర్ శ్రీ కె.శ్రీనివాస చౌదరి, ప్లాట్ నెం.165, ప్రశాసన్‌నగర్, జూబ్లీ హిల్స్, హైదరాబాద్.

సమన్లు
అపీలుదారు గౌరవనీయ ప్రిసైడింగ్ అధికారి, డెట్స్ రికవరీ ట్రిబ్యునల్-II, హైదరాబాద్‌వారిచే జారీచేయబడిన 22-4-2026 తేదీనాటి ఉత్తర్వు మీద రికవరీ ఆఫ్ డెట్స్ అండ్ బ్యాంక్‌రప్సీ యాక్ట్, 1993 లోని సెక్షన్ 20 క్రింద మెమోరాండం ఆఫ్ అపీల్‌ను దాఖలు చేశారు మరియు ఇతర పరిహారాలను కోరారు. సదరు విషయం గౌరవనీయ ఛైర్‌పర్సన్ సమక్షంలో ఉంచబడినందున మీరు 9-10-2026న ఉ.10.30 గం.లకు ఈ ట్రిబ్యునల్ సమక్షంలో హాజరు కావల్సిందిగా మీకు ఇందుమూలముగా సమను ఇవ్వడమైనది. ఐఎ/397/2026 ను వ్యతిరేకించుటకు మీవద్ద ఏదేని ఉంటే, ఈ సమను ప్రచురణ తేది నుండి మూడు వారాల్లోగా అపీలుదారుకు ఒక కాపీతో దాఖలు చేయవల్సిందిగా మిమ్మల్ని ఇంకను ఆదేశించడమైనది. 2. మీరు ఏవేని డాక్యుమెంట్లను దాఖలు చేయదల్చినచో, వ్యతిరేకతతోపాటు ఒక జాబితాతో వాటిని దాఖలు చేయవచ్చును. 3. మీరు స్వయంగాగాని లేదా తగువిధంగా సూచించబడిన న్యాయవాది/అడ్వొకేట్ ద్వారా గాని ట్రిబ్యునల్ సమక్షంలో హాజరగునప్పుడు మీ నమోదిత చిరునామాతోపాటు ఇమెయిల్‌ఐడి, మొబైల్ నెంబరు మరియు హాజరు యొక్క మెమోను దాఖలు చేయవలెను. 4. ఇందులో తెలిపిన తేదీన మీరు హాజరుకాని పక్షంలో, సదరు ప్రొసీడింగ్ మీ పరోక్షంలో విచారించబడుతుంది మరియు నిర్ణయించబడుతుందని గమనించగలరు.
ఈ ట్రిబ్యునల్ యొక్క అధికారిక ముద్ర మరియు నా చేవ్రాలుతో **28 ఆగస్టు 2026** న ఇవ్వబడినది.
సమన్లు జారీచేయు అధీకృత అధికారి సంతకం

జగదాంబ సేవలు నిరుపమానం

జడ్పీ సీఈవోకు మొక్క ఇస్తున్న ధర్మరాజు, చిత్రంలో ప్రభాకర్ తదితరులు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లా పరిషత్తు సీఈవో పి.జగదాంబ ఏళ్లుగా నిరుపమాన సేవలందించారని దెందులూరు, ఉంగుటూరు ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, పత్సమట్ల ధర్మరాజు కొనియాడారు. పి.జగదాంబ ఉద్యోగ విరమణ సందర్భంగా.. స్థానిక క్రాంతి కల్యాణ మండపంలో సోమవారం రాత్రి అభినందన సభ నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, జిల్లా, మండల స్థాయి అధికారులు హాజరై ఆమెను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. పంచాయతీరాజ్ శాఖలోని వివిధ హోదాల్లో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించారని, అర్హులకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించడంలో కీలకంగా వ్యవహరించారని పేర్కొన్నారు. జడ్పీ డిప్యూటీ సీఈవో కె.భీమేశ్వర్, జడ్పీ కార్యాలయ పరిపాలనాధికారులు తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ ఇన్‌ఛార్జి సీఈవోగా మల్లికార్జునరావు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లా పరిషత్తు ఇన్‌ఛార్జి సీఈవోగా జిల్లా పంచాయతీ అధికారి జేవీకే మల్లికార్జునరావును నియమిస్తూ కలెక్టర్ కె.వెట్రిసెల్వి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న జడ్పీ సీఈవో పి.జగదాంబ సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. దాంతో డీపీవోకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

పోలవరం ప్రాజెక్టు ఎస్ఈగా రామచంద్రరావు

పోలవరం, న్యూస్‌టుడే: పులిచింతల ప్రాజెక్టు ఎస్ఈగా పనిచేస్తున్న పి.రామచంద్రరావును పోలవరం ప్రాజెక్టు ఎస్ఈగా నియమించారు. ఆయన రెండు రోజుల కిందట బాధ్యతలు స్వీకరించారు. రెండు నెలల కిందట ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఈ ఆర్.రామచంద్రరావు ఉద్యోగ విరమణ చేయడంతో ఇప్పటి వరకు ఈఎన్‌సీ కె.నరసింహమూర్తి ఎస్ఈ బాధ్యతలు పర్యవేక్షించారు.

టెట్ రద్దు కోరుతూ 2 నుంచి నిరవధిక ధర్నా

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులకు టెట్‌ను రద్దు చేయాలని కోరుతూ గుంటూరులోని విద్యాభవన్ వద్ద ఈ నెల 2 నుంచి 11వ తేదీ వరకు నిరవధిక ధర్నా చేస్తున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జి.ప్రకాశం తెలిపారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు 4న ధర్నాలో పాల్గొనాలని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు.

బంతి సాగులో సస్యరక్షణ

టి.నరసాపురం, న్యూస్‌టుడే: బంతిసాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టడం వల్ల అధిక దిగుబడులు పొందవచ్చని ఏలూరు ఉద్యాన సహాయ సంచాలకులు సంతోష్ తెలిపారు.

బూడిద, ఆకుమచ్చ తెగుళ్లు: శీతాకాలంలో గాలిలో తేమ అధికంగా ఉండటంతో సోకుతాయి. వీటి వల్ల పూలు నాణ్యత తగ్గడంతోపాటు కుళ్లి పోతుంటాయి. **నివారణ:** సాఫ్ 300 గ్రాములు లేదా కాంటాఫ్ 400ఎంఎల్ లేదా క్లోరోథియా 250 ఎంఎల్ మందు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

రసం పీల్చే పురుగులు: నల్లి, తెల్లదోమ, పేనుబంక ఇవి ఆకులపై చేరి రసాన్ని పీల్చడం వల్ల దిగుబడి గణనీయంగా తగ్గుతుంది. **నివారణ:** ఆల్టాగా 100గ్రాములు లేదా కాన్ఫిడార్ 200ఎంఎల్ మందు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

పచ్చ పురుగు, లద్దె పురుగు: పచ్చ పురుగు ఆకులపై చేరి ఆకుపై రంధ్రాలు చేస్తూ తింటాయి. లద్దె పురుగు ఆకుపై త్రోత్ర ఆకారంలో తింటూ మొక్క ఎదుగుదల నిలిచి పూత రావడం తగ్గుతుంది. **నివారణ:** ప్రొఫెక్స్ 100గ్రాములు లేదా కొరాజెన్ 60ఎంఎల్ మందు 200లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

పాము పేను: బియ్యపు పురుగు ఆకు కింది భాగంలో చేరి పత్ర హరితాన్ని గోకి తింటాయి. దీనివల్ల కిరణజన్య సంయోగ క్రియ నిలిచిపోయి పంట దిగుబడి తగ్గుతుంది. **నివారణ:** అబామెక్టిన్ 100ఎంఎల్ లేదా ట్రైజోఫాస్ 400ఎంఎల్ మందు 200లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

ఉద్యాన విశ్వవిద్యాలయం న్యూస్‌టుడే

ప్రశ్న: ఆయిల్‌పామ్‌లో పీడ ఆశ తెగులు ఎలా నివారించాలి - గంగరాజు, బొర్రంపాలెం

సమాధానం: దీనిని మొదలు కుళ్లు తెగులు అని కూడా పిలుస్తారు. ఇది అత్యంత ప్రమాదకరమైన తెగులు. గానోడెర్మా అనే శిలీంధ్రం వల్ల ఆశిస్తుంది. చెట్టు కింది వరుస ఉన్న ఆకులు పసుపు రంగులోకి మారి ఎండిపోయి రాలిపోతాయి. కాండం కింది భాగం కుళ్లిపోతుంది. తెగులు తీవ్రత ఎక్కువైతే కాండం భాగంలో గోధుమ రంగులో గట్టిగా ఉండే పుట్టగొడుగు మాదిరి ఫంగస్ ఏర్పడుతుంది. క్రమంగా చెట్టు చనిపోతుంది. తెగులు సోకి చనిపోయిన లేదా ఎండిపోయిన చెట్లను వేళ్లతో సహా పూర్తిగా పెకలించి దహనం చేయాలి. నీరు నిల్వ ఉండకుండా నీటి పారుదల సౌకర్యం కల్పించాలి. తెగులు ఆరంభ దశలో ఉంటే సిఫారసు చేసిన శిలీంధ్ర నాశినులను చెట్టు మొదళ్లలో వేర్ల చుట్టూ తడిసేలా పోయాలి.

డా.హేమ కిరణ్ కుమార్
ప్రధాన శాస్త్రవేత్త
కృషి విజ్ఞాన కేంద్రం, వెంకట్రామన్నగూడెం

మీరూ అడగొచ్చు ✆ చరవాణి 73826 33692

నల్లమొప్ప తెగులుతో నష్టం

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: ఆక్వా చెరువుల్లో సాగు చేస్తున్న వనామీ రొయ్యలకు ఆశిస్తున్న నల్లమొప్ప వ్యాధి సోకి మృత్యువాత పడుతున్నాయి. దీని నివారణకు ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించాలని ఆక్వా రంగ నిపుణుడు అడబాల గోపాలరావు సూచించారు. అధిక మేత వినియోగంతో చెరువు అడుగుకు చేరి అవి కుళ్లిపోవడంతో వాటి నుంచి అమ్మోనియా, నైట్రైట్ వంటి విషవాయువులు వెలువడుతున్నాయి. వాటి ప్రభావంతో మొప్పలు నలుపు రంగులోకి మారి రోగాల బారిన పడుతున్నాయి. ఈ వ్యాధి సోకిన రొయ్యలు ఆక్సిజన్ తీసుకోలేక నీటిపై ఈదుతాయి. రైతులు వెంటనే అప్రమత్తమై నివారణ చర్యలు చేపట్టకుంటే అవి మృత్యువాత పడతాయి. ఈ వ్యాధి నిరోధానికి అవసరమైన మేరకు చెరువులో ప్రొబయోటిక్స్ వినియోగించాలి. చెరువుల్లో అవసరం మేరకు మేత వినియోగించాలి. జియోలైట్ చల్లాలి. ప్రభుత్వం నిషేధించిన యాంటీబయోటిక్స్ వినియోగించకూడదని గోపాలరావు సూచించారు.

నిలిచిన రైలు.. ప్రయాణికుల అవస్థలు

చేబ్రోలు స్టేషన్‌లో తిరుపతి-కాకినాడ ఎక్స్‌ప్రెస్

జాతీయ రహదారి పక్కన నిరీక్షిస్తూ..

చేబ్రోలు(ఉంగుటూరు), న్యూస్‌టుడే: చేబ్రోలు రైల్వే స్టేషన్‌లో తిరుపతి- కాకినాడ(17249) ఎక్స్‌ప్రెస్ రైలు సోమవారం సుమారు మూడు గంటలపాటు నిలిచిపోయింది. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరులో గూడ్సు పట్టాలు తప్పడంతో.. పలు రైళ్ల రాకపోకలు ఆగిపోయాయి. తిరుపతి- కాకినాడ ఎక్స్‌ప్రెస్‌లోని ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. 216ఏ జాతీయ రహదారిపైకి చేరుకొని బస్సులు, ఆటోల్లో తమ గమ్యస్థానాలకు చేరుకున్నారు.

రెడ్‌క్రాస్‌కు రాష్ట్ర స్థాయి అవార్డులు

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా రెడ్‌క్రాస్ సంస్థకు రాష్ట్ర స్థాయి అవార్డులు లభించినట్లు కలెక్టరేట్ అధికారులు సోమవారం తెలిపారు. 2025-26 సంవత్సరానికి కలెక్టర్ నాగరాణి, 2024-25 సంవత్సరానికి నాటి జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి స్వర్ణ పతకాలు అందుకోనున్నారని వెల్లడించారు. సెప్టెంబరు 1న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఏపీ శాఖ వార్షిక సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఈ అవార్డులు అందజేస్తారని తెలిపారు.

సదుపాయాల కల్పనే ప్రభుత్వ ధ్యేయం: ఎంపీ

ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మహేశ్‌కుమార్ తదితరులు

పెరుగుగూడెం(దెందులూరు), న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధి, రహదారుల పునర్నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ అన్నారు. చల్లచింతలపూడిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో కలిసి భూమి పూజ చేశారు. ఎంపీ మాట్లాడుతూ.. చల్లచింతలపూడి- తిమ్మనగూడెం రహదారిని రెండు, మూడు నెలల్లోపు పూర్తి చేస్తామన్నారు. ఏళ్లుగా అధ్వానంగా ఉన్న రోడ్డుకు చింతమనేని చొరవతో విముక్తి లభిస్తోందన్నారు. అనంతరం పెరుగుగూడెంలో ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఏఎంసీ ఛైర్‌పర్సన్ గారపాటి రామసీత, నాయకులు బొప్పన సుధా, మోతుకూరి నాని, పెనుబోయిన మహేష్ యాదవ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సహాయకుల నియామకాల్లో అవకతవకలు

గత కమిషనర్, పర్యవేక్షకుడిపై చర్యలు

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: ఆరోగ్య సహాయకుల నియామకాల్లో అక్రమాలకు పాల్పడిన కేసులో ఏలూరు నగరపాలక సంస్థ గత కమిషనర్ ఆకుమల్ల మోహనరావు, కార్యాలయ పర్యవేక్షకుడు కేవీఎస్ఆర్ ఎస్ఎస్ శర్మపై క్రమశిక్షణ, శాఖాపరమైన చర్యలు తీసుకుంటూ సోమవారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. వివరాల్లోకి వెళితే.. అప్పట్లో నిబంధనలకు విరుద్ధంగా నలుగురు అనర్హులకు ఆరోగ్య సహాయకులుగా ఉద్యోగోన్నతి కల్పించారు. దీనిపై ఆరోపణలు రావడంతో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విచారణ చేపట్టారు. నిబంధనల ఉల్లంఘన నిజమేనని తేలడంతో చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ఉద్యోగ విరమణ పొందిన మోహనరావు, కేవీఎస్ ఆర్ఎస్ఎస్ శర్మ పింఛనులో కోత విధించేలా చర్యలు చేపట్టారు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
SBI
స్ట్రెస్సడ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి, పరిపాలన కార్యాలయ ప్రాంగణం, బాలాజీ నగర్, సిరిపురం, విశాఖపట్నం

అధీకృత అధికారి వివరములు : పేరు : శ్రీ నిరంజన్ దొర (చీఫ్ మేనేజర్), మొబైల్ నెం.8895144004,
ఇ-మెయిల్ ఐడి: sbi.10077@sbi.co.in, ఆస్తి తనిఖీ కొరకు : 8330952080

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 8(6)తో 9(1) నిబంధనలతో చదువబడు (సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద బ్యాంకునకు తనఖా చేసిన స్థిరాస్తుల అమ్మకము)
SARFAESI చట్టం 2002 ప్రకారం సెక్షన్ 13(4) క్రింద దిగువ తెలిపిన ఆస్తి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారిగా దిగువ సంతకందారు స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు బకాయిలు రాబట్టుకొనుటకు దిగువ తెలిపిన తనఖాపెట్టిన ఆస్తి/ఆస్తుల ఈ-వేలం (SARFAESI చట్టం 2002 క్రింద) "ఎక్కడ ఎలా వున్నది అక్కడ అలానే" మరియు "అక్కడ ఏమున్నదో అదే" పద్ధతి పై నిర్వహించబడుతుందని సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది మరియు నియమ నిబంధనలు దిగువ తెలుపబడినవి.

1 ఋణగ్రహీత: **శ్రీ నర్రా దేవి ప్రసాద్ చౌదరి,** తండ్రి: ఎన్. నరసింహారావు, డోర్ నెం.4-123/8, ద్వారకా నగర్, బి డి కాలనీ, తంగెళ్ళమూడి గ్రామం, ఏలూరు మండలం, ఏలూరు జిల్లా - 534005. **శ్రీ నర్రా దేవి ప్రసాద్ చౌదరి,** తండ్రి: ఎన్.నరసింహ రావు, జి-2, చలసాని రెసిడెన్సీ, సౌభాగ్య లక్ష్మి అమ్మవారి గుడి దగ్గర, పట్లూరు గ్రామ పంచాయితీ, ఏలూరు మండలం, పశ్చిమగోదావరి జిల్లా. **డిమాండ్ నోటీసు తేది: 23-05-2023**
డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం : తేది.22-05-2023 నాటికి **రూ.36,99,521/- + తేది.23.05.2023** నుండి వడ్డీ మరియు ఇతర ఖర్చులు మొదలగునవి.
ప్రస్తుత బకాయి మొత్తం: తేది.27-08-2026 నాటికి **రూ.53,89,406/- + తేది.28.08.2026** నుండి భవిష్య వడ్డీ మరియు ఇతర ఖర్చులు మొదలగునవి (మునుపటి జమలు మినహాయించిన తరువాత).

షెడ్యూలు ఆస్తి వివరములు:
పశ్చిమగోదావరి జిల్లా, పట్లూరు సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్, పెదపాడు మండలం, పట్లూరు గ్రామం మరియు గ్రామ పంచాయితీ, సౌభాగ్యలక్ష్మి గుడి రోడ్డు ఎదురుగా, డోర్ నెం. 4-93తో, ఎల్‌పి నెం.382/1986, ఆర్.ఎస్.నెం.191/5, 191/6, 191/7, 190/2 & 190/3 లోని ప్లాట్ నెం.7 & 12 లతో మొత్తం 704.96 చ॥గ॥లు (353.30 చ॥గ॥లు + 351.66 చ॥గ॥లు) స్థల విస్తీర్ణంలో 32 చ॥గ॥ల అవిభాజ్యపు వాటా విస్తీర్ణంతో "చలసాని రెసిడెన్సీ అపార్ట్‌మెంట్" క్రింది అంతస్తు నందు 980 చ॥అ॥లు (కామన్ ఏరియా & కార్ పార్కింగ్ ఏరియాతో సహా) విస్తీర్ణంతో గల ఆర్‌సిసి రూఫ్‌డ్ నివాస డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ నెం.జి-02 యావత్తు ఆస్తి శ్రీ నర్రా దేవి ప్రసాద్ చౌదరి, తండ్రి : నరసింహారావు గారికి చెందినది. (రిజిష్టర్డు సేల్ డీడ్ నెం.1458/2018, తేది.22.06.2018 ప్రకారం). **అపార్ట్‌మెంట్‌కు హద్దులు: తూర్పు** : 33 అ॥ల వెడల్పు రోడ్డు, **దక్షిణం** : ప్లాట్ నెం.13 యొక్క మిగిలిన స్థలం కొంతమేర మరియు పి. చంద్రమోహన్ భవనం ప్లాట్ నెం.08 కొంతమేర, **పడమర:** 40 అ॥ల వెడల్పు రోడ్డు, **ఉత్తరం** : ఓపెన్ స్పేస్. **ఫ్లాట్‌కు హద్దులు: తూర్పు** : కామన్ కారిడార్, ఫ్లాట్ నెం.జి-03 మరియు లిఫ్ట్, **దక్షిణం:** ఓపెన్ టు స్కై, **పడమర:** ఫ్లాట్ నెం.జి-01, **ఉత్తరం** : కామన్ కారిడార్, ఓపెన్ టు స్కై.

రిజర్వు ధర : రూ.22,40,000/- ధరావత్తు : రూ.2,24,000/- బిడ్ పెంపుదల : రూ.10,000/-

2 ఋణగ్రహీత: **శ్రీ ఉచ్చుల సుధీర్ కుమార్,** తండ్రి : వి. దాసు, డోర్ నెం.7డి-5-22/ఎ, పాటిమళ్ళ వారి లేన్, తూర్పు వీధి, ఏలూరు, ఏలూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్. **డిమాండ్ నోటీసు తేది: 21-06-2025**
డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం : తేది.16.06.2025 నాటికి **రూ.54,84,294/- + తేది.17.06.2025** నుండి వడ్డీ మరియు ఇతర ఖర్చులు మొదలగునవి. **ప్రస్తుత బకాయి మొత్తం: తేది.27-08-2026** నాటికి **రూ.62,13,146/- + తేది.28.08.2026** నుండి భవిష్య వడ్డీ మరియు ఇతర ఖర్చులు మొదలగునవి (మునుపటి జమలు మినహాయించిన తరువాత).

షెడ్యూల్ ఆస్తి వివరములు:
ఏలూరు సబ్ డిస్ట్రిక్ట్, ఏలూరు మండలం, ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్, తూర్పు వీధి, కనకదుర్గ గుడి దగ్గర, సమీప డోర్ నెం.7డి-2-35 వద్ద అసెస్మెంట్ నెం.1075000704 & టి.ఎస్.నెం.1569 లోని 102 చ॥గ॥ల స్థల విస్తీర్ణంలో ఆర్‌సిసి రూఫ్‌డ్ క్రింది, మొదటి మరియు రెండవ అంతస్తులతో కూడిన నివాస భవనం యావత్తు ఆస్తి శ్రీ ఉచ్చుల సుధీర్ కుమార్, తండ్రి : వి. దాసు గారికి చెందినది. (రిజిష్టర్డు సేల్ డీడ్ నెం.4357/2017, తేది.30.05.2017 ప్రకారం). **హద్దులు: తూర్పు:** మళ్ళ దుర్గ, భర్త: మళ్ళ గోవింద్ గారి స్థలం మరియు ఇల్లు, **దక్షిణం** : మున్సిపల్ రోడ్డు, **పడమర** : నూలు సుధాకర్ రావు గారి ఆస్తి, **ఉత్తరం** : బొడుగు నమశ్శివాయ గారి ప్రహరీ గోడ.

రిజర్వు ధర : రూ.34,30,000/- ధరావత్తు : రూ.3,43,000/- బిడ్ పెంపుదల : రూ.10,000/-

ఇ-వేలం తేదీ : 23-09-2026 సమయం : ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

ఆస్తి తనిఖీ తేది మరియు సమయం: తేది:01-09-2026 నుండి 22-09-2026 వరకు ఉ॥10.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు
1) అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్స్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క వెబ్ సైట్ : www.sbi.co.in/web/sbi-in-the-news/auction-noticesలో ఏర్పాటుచేసిన లింకును రిఫర్ చేయండి. రిజిస్ట్రేషన్, ఐయండి, వేలం యొక్క వివరములు మొదలగు వాటి గురించి సర్వీసు ప్రొవైడర్ M/s. PSB Alliance & M/s. Baanknet యొక్క ఇ-వేలం పోర్టల్ : https://baanknet.com/eauction-psb/x-login & https://baanknet.com & టోల్ ఫ్రీ ఫోన్ నెం.: 91 - 8291220220, Mail ID : support.baanknet@psballiance.comను సంప్రదించండి.
2) ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వర్తించే స్టాంపు డ్యూటీలు ఐదిలీ ఛార్జీలు, ఫీజు వగైరా మరియు చట్టపరమైన/నాన్ స్టేటటరీ బకాయిలు, పన్నులు, రేట్లు, ఎస్సెస్‌మెంట్ ఛార్జీలు, ఫీజులు వగైరా కొనుగోలు దారే భరించవలెను.
గమనిక : ఆసక్తి గల బిడ్డర్లు ఇ-వేలం తేదీలోపు PSB Alliance యొక్క వెబ్‌సైట్ https://baanknet.com నందు ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి (Pre-Bid EMD) జమ చేయవలెను.
గమనిక -2 : ఆదాయపు పన్ను చట్టం 1961లోని సెక్షన్ 194-1A ప్రకారం అమ్మకంలో భాగంగా అమ్మకం విలువ **రూ.50,00,000/-** (యాభై లక్షల రూపాయలు) మరియు అంతకంటే ఎక్కువ ఉన్నచో సదరు మొత్తముపై **TDS @ 1%** వర్తిస్తుంది. కావున సఫలీకృత బిడ్డరు/కొనుగోలుదారు గవర్నమెంట్ గైడ్‌లైన్స్ ధర లేదా అమ్మకం ధరలో ఏది ఎక్కువైతే దానిలో **1% TDS** ను తగ్గించుకొని సదరు మొత్తమును ఆదాయపు పన్ను డిపార్ట్‌మెంట్ యొక్క ఫారం నెం.16-బి నందు జమచేయవలెను మరియు సదరు ఒరిజినల్ **TDS** సర్టిఫికెట్‌ను బ్యాంకు వారికి సమర్పించవలెను.(వ్యవసాయ భూమి కాకుండా కేవలం స్థిరాస్తికి మాత్రమే వర్తించును).

తేది: 27-08-2026, ప్రదేశం: విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

మాదకద్రవ్యాల జోలికెళ్లకుండా నిఘా

పవరుపేట(ఏలూరు కలెక్టరేట్), న్యూస్‌టుడే: యువత మాదకద్రవ్యాల జోలికి వెళ్లకుండా నిఘా పెట్టాలన్నారు కలెక్టర్ వెట్రిసెల్వి. స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి మాదకద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. వెట్రిసెల్వి మాట్లాడుతూ.. గంజాయి, మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలన్నారు. ఏలూరును మాదకద్రవ్య రహిత జిల్లాగా మార్చేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల నిరోధానికి ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్లు 14446, 1972పై విస్తృత అవగాహన కల్పించాలని ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ సూచించారు. రవాణా శాఖాధికారి శేఖర్, డీపీవో మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

యూసీజీ ప్రాజెక్టుపై నివేదిక: కలెక్టర్

పవరుపేట(ఏలూరు కలెక్టరేట్), న్యూస్‌టుడే: చింతలపూడి మండలంలో సమీకృత భూగర్భ బొగ్గు వాయు ఉత్పత్తి(యూసీజీ) కాంప్లెక్స్ ఏర్పాటుకు తీసుకుంటున్న చర్యలపై నివేదిక సమర్పించనున్నట్లు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. రాష్ట్ర సచివాలయం నుంచి పరిశ్రమలు, గనుల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ సోమవారం కలెక్టర్, వివిధ శాఖల అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వెట్రిసెల్వి మాట్లాడుతూ.. రేచర్ల, శెట్టివారిగూడెంలలో యూసీజీ ప్రాజెక్టు కాంప్లెక్స్ ఏర్పాటుకు అవసరమైన భూ సేకరణ, మౌలిక వసతులు, పర్యావరణ అనుమతులు, భద్రతా ప్రమాణాలు తదితర అంశాలను పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. జేసీ అభిషేక్ గౌడ, నూజివీడు సబ్ కలెక్టర్ బి.వినూత్న తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: తణుకు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల వేదికగా సెప్టెంబరు 12, 13 తేదీల్లో రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బీడీ నాగేశ్వరరావు, ఎస్.సూర్యనారాయణ తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి మాస్టర్స్ క్రీడాకారులు హాజరవుతారని చెప్పారు. తణుకు చిట్టూరి ఇంద్రయ్య డిగ్రీ కళాశాలలో ఈ నెల 4న జిల్లా స్థాయి ఎంపికలు ఉంటాయన్నారు. 30 ఏళ్లు పైబడిన క్రీడాకారులు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 98852 74122, 99893 63978 నంబర్లను సంప్రదించాలని వారు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

భార్యతో విభేదాలు.. భర్త ఆత్మహత్య

ముదినేపల్లి, న్యూస్‌టుడే: భార్యతో విభేదాలు, ఆస్తి విషయంలో నెలకొన్న వివాదాల నేపథ్యంలో మనస్తాపానికి గురైన భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చిగురుకోట శివారు మీగడాపురంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చెందిన జి.వంశీకృష్ణ (43)కు సృజనతో వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయిదేళ్లుగా దంపతుల మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో పిల్లలతో పాటు సృజన పుట్టింటి దగ్గర ఉంటున్నారు. పలుమార్లు కాపురానికి రావాలని వంశీకృష్ణ కోరినా ఆమె అంగీకరించలేదని, ఆస్తిలో వాటా కోరినట్లు అతని తల్లి సత్యవతి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆదివారం మధ్యాహ్నం తల్లితో కలిసి భోజనం చేసి గదిలోకి వెళ్లి పడుకున్న వంశీకృష్ణ ఎంతకీ రాకపోవడంతో రాత్రి 9 గంటల సమయానికి కిటికీలో నుంచి చూడగా చీరతో సీలింగ్‌కు ఉరివేసుకుని కనిపించారు. మృతుడి తల్లి సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ ప్రదీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు సోమవారం అప్పగించారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 228 చికెన్ స్కిన్‌లెస్ - 257.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

92.7 FM Rajamahendravaram
92.7 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). ✆ 8142292071.

రాజమండ్రిలో హాస్పిటల్ నందు పనిచేయుటకు GNM/ B.Sc. నర్సులు అర్జెంటుగా కావలెను. Contact Cell: 76749 99909/06.

REAL ESTATE

విశాఖపట్నం, మధురవాడ, సింహాచలం, ఆనందపురం, భోగాపురం ఏరియాల్లో ప్లాట్స్ కొనాలన్నా అమ్మాలన్నా సంప్రదించండి ✆ 8790921259.

JOBS

ఏలూరులో ప్రముఖ మెడికల్ షాపునందు వర్క్ చేయుటకు డెలివరీ బాయ్స్, కంప్యూటర్ ఆపరేటర్స్, హెల్పర్స్ కావలెను. వెంటనే సంప్రదించండి. సెల్: 98496 77662.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 5.55 పై॥
తణుకు ఆఫీసు: 08819-224254

ఏలూరు

•ఏలూరు •దెండులూరు •ఉంగుటూరు

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

గణపవరం, న్యూస్‌టుడే: కామవరపుకోట వేదికగా నిర్వహించిన సాఫ్ట్‌బాల్ పోటీల్లో గణపవరం పీఎంశ్రీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. సబ్ జూనియర్ విభాగంలో రుద్ర హాసిని, పాండ్రంకి జ్యోతి, పి.వర్షిత, జూనియర్ విభాగంలో ఎం.వైష్ణవి, పి.మనస్విని, ఎం.తేజస్విని, కె.శ్రీనిధి, జె.శిరీష, ఎం.దివ్య, బి.చైతన్య రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ప్రధానోపాధ్యాయుడు హోతా ఆంజనేయులు, ఎంఈవో జి.బాలయ్య, ఎంపీపీ రాము, జడ్పీటీసీ సభ్యురాలు సోమలక్ష్మి అభినందించారు.

కాలువ గట్టు.. వ్యర్థాలతో నిండేట్టు

ఉంగుటూరు ఏలూరు కాలువ గట్టు డంపింగ్ యార్డుగా మారింది. ఇళ్లలోని చెత్తను కొందరు కాలువ గట్టుపై పడేస్తున్నారు. వాటిని తొలగించకపోవడంతో కుళ్లిపోయి దుర్వాసన వస్తోంది. కాలువ జలాలు సైతం కలుషితమవుతున్నాయి. **- న్యూస్‌టుడే, నారాయణపురం**

ఉండలేక.. ఉంచుకోలేక

ఏలూరు తూర్పులాకుల వద్ద జలవనరుల శాఖ సిబ్బంది సౌకర్యార్థం నివాస సముదాయాలు నిర్మించారు. వీటి నిర్వహణను విస్మరించడంతో నిరుపయోగంగా మారాయి. ఇక్కడ కొందరు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. **- న్యూస్‌టుడే, ఏలూరు గ్రామీణ**

కంకర తేలింది.. జరజర జారుతోంది!

నరకం చూస్తున్న వాహనదారులు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఏలూరు గ్రామీణ మండలంలోని లంక గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు నరకానికి నకలుగా, ప్రమాదాలకు చిరునామాగా మారాయి. అడుగడుగునా గుంతలతో అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. ఏలూరు నుంచి లంక గ్రామాలకు వెళ్లే ప్రధాన మార్గం, మాధవాపురం పర్యాటక కేంద్రం నుంచి గుడివాకలంక, కొక్కిరాయిలంకకు వెళ్లే దారి, మొండికోడుకు వెళ్లే రోడ్డు భారీ గుంతలతో ఆనవాళ్లు కోల్పోయాయి.

అధ్వానంగా లంక గ్రామానికి వెళ్లే రోడ్డు

ప్రమాద ఘంటికలు మోగిస్తూ..

పైడిచింతపాడు, ప్రత్తికోళ్లలంక, కొక్కిరాయిలంక, గుడివాకలంక, మొండికోడు, మాధవాపురం తదితర గ్రామాల నుంచి ఏలూరు నగరానికి నిత్యం వేల మంది రాకపోకలు సాగిస్తుంటారు. కొల్లేరులో వేటాడిన చేపలను ఏలూరు చేపల మార్కెట్‌లో విక్రయించేందుకు, విద్యాలయాలకు వెళ్లే విద్యార్థులు, ఇతరత్రా పనుల నిమిత్తం వాహనాల్లో ప్రయాణిస్తుంటారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు తటాకాల్ని తలపిస్తున్నాయి. గోతుల్లో మోకాలి లోతు నీరాయి. రాత్రివేళ వీటిని గుర్తించలేక.. వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికే పదుల సంఖ్యలో చోదకులు అదుపు తప్పి పడిన ఘటనలున్నాయి.

భారీ వాహనాలతో..

ఏలూరు నుంచి లంక గ్రామాలకు రోజూ పెద్ద సంఖ్యలో భారీ వాహనాలు టన్నులకొద్దీ చేపల మేత తీసుకెళ్తుంటాయి. వీటి కారణంగా అధ్వాన రహదారులు మరింత ఛిద్రమవుతున్నాయి. వర్షాలకు బురద వాహనాలు దిగబడిపోతున్నాయి. ఒక్కోసారి ట్రాఫిక్ సైతం నిలిచిపోతోంది. అధికారులు స్పందించి రహదారుల్ని బాగు చేయాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు.

సమస్యలు పేరుకుపోయి.. సేవలు నిలిచిపోయి

నామమాత్రంగా ఆసుపత్రి అభివృద్ధి కమిటీలు

పెదపాడు, న్యూస్‌టుడే: దెండులూరు నియోజవర్గంలోని పెదపాడు, పెదవేగి, దెండులూరు, ఏలూరు గ్రామీణ మండలాల్లో రెండేసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడానికి గతంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీలను ప్రభుత్వం నియమించింది. ఇందులో ఎంపీపీ, ఎంపీడీవో, తహసీల్దార్, ఇతర ప్రజాప్రతినిధులు సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ మూణ్నెల్లకోసారి సమావేశమై.. పీహెచ్‌సీలోని సమస్యలను గుర్తించాలి. అందుబాటులోని నిధులు వెచ్చించి, వాటి పరిష్కారానికి చొరవ చూపాలి.

నిర్వహణ కొరవడి.. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో.. వైకాపా నుంచి గెలుపొందిన ఎంపీపీలు, ఇతర ప్రజాప్రతినిధులు పీహెచ్‌సీల అభివృద్ధిని విస్మరించారు. ఫలితంగా ఆసుపత్రుల నిర్వహణ కొరవడి. . రోగులు ఇబ్బంది పడుతున్నారు. సిబ్బందికి దిశానిర్దేశం చేసేవారు కరవయ్యారు. ఆదివారాల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి. రోగులకు మెరుగైన సేవలందించాలి. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటాం' అని జిల్లా వైద్యాధికారిణి శోభ తెలిపారు.

మండల కేంద్రం పెదపాడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రమిది. ఇక్కడ 24 గంటలపాటు రోగులకు సేవలందించాలి. కానీ, సాయంత్రం అయిదు గంటలైతే చాలు.. సిబ్బంది ఇంటిబాట పడుతున్నారు. ఏలూరు నగరంలో వైద్యులు నివాసం ఉండటంతో.. పొద్దుపోక ముందే వెళ్లిపోతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులు ఏలూరు సర్వజన ఆసుపత్రి లేదా ప్రైవేటు వైద్యశాలలను ఆశ్రయించాల్సి వస్తోంది.

ఇదీ పరిస్థితి పెదవేగి మండలంలో పెదవేగి, విజయరాయిలో పీహెచ్‌సీలున్నాయి. పెదవేగిలో వైద్య సేవలు అంతంతమాత్రమే. దీనికి తోడు మౌలిక వసతులు, సిబ్బంది కొరత వేధిస్తోంది. దాంతో రోగులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. రాత్రివేళ సేవలు గగనంగా మారాయి. విజయరాయిలో పీహెచ్‌సీకి సొంత భవన నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. నిధులు కేటాయించకపోవడంతో పునాదుల దశలో నిలిచిపోయింది. దాంతో గ్రామ ఆరోగ్య కేంద్రంలో పీహెచ్‌సీని నిర్వహించాల్సి వస్తోంది.

గ్రామీణుల దాహార్తి తీర్చడమే ధ్యేయం

పెదపాడు: ఆమీలుజమ దంపతులకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ప్రభాకర్

సీతంపేట (దెందులూరు), న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల దాహార్తి తీర్చడమే ధ్యేయమన్నారు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్. ప్రజల తాగునీటి అవసరార్థం ఏలూరు తూర్పు లాకుల వద్ద జలాలు నిల్వ చేసి.. అక్కణ్నుంచి సీతంపేట హెడ్ ద్వారా మండలానికి తాగునీరందించేలా ప్రణాళిక రూపొందించారు. సీతంపేట వద్ద కాలువ నీటి ప్రవాహానికి అవరోధాలు కలగకుండా సోమవారం పొక్లెయిన్ సాయంతో ప్రక్షాళన చేపట్టారు. ఈ పనులను ఎమ్మెల్యే పర్యవేక్షించారు.

పెదపాడు: ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీడీవో మహ్మద్ ఆమీలుజమ ఉద్యోగ విరమణ సభ సోమవారం నిర్వహించారు. చింతమనేని ముఖ్య అతిథిగా హాజరై ఎంపీడీవో దంపతులను సన్మానించారు. తహసీల్దారు ఆకుల కృష్ణజ్యోతి, కార్యాలయ పర్యవేక్షకురాలు ఇందిరాగాంధీ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ప్రగతికి కార్యాచరణ: ఎంపీ

మహేశ్ కుమార్‌కు మొక్క అందజేస్తున్న శ్రీనివాస్

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నట్లు ఎంపీ మహేశ్ కుమార్ అన్నారు. సీతాపురంలోని విడిది కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించి మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంత కృషి చేస్తున్నట్లు చెప్పారు. ★ విడిది కార్యాలయంలో ఎంపీ మహేశ్ కుమార్‌ను ఏపీఎన్‌జీజీవోల సంఘ జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఏలూరు ఎన్‌జీవో హోమ్‌కు నిధులు కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా సంక్షేమమే జనసేనాని లక్ష్యం

పార్టీ శ్రేణులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా జనసేనాని పవన్ కల్యాణ్ ముందుకెళ్తున్నారని.. ఆయన జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పిలుపునిచ్చారు. స్థానిక విడిది కార్యాలయంలో పార్టీ నాయకులతో సోమవారం సమావేశమై మాట్లాడారు. సెప్టెంబరు 2న యువజన విభాగం ప్రారంభంతోపాటు భారీ ప్రదర్శన చేపట్టాలని సూచించారు. ★ నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుపై ఏపీఐఐసీ ఏలూరు జోనల్ మేనేజర్ కె.బాబ్జితో ఎమ్మెల్యే ధర్మరాజు చర్చించారు. భూముల గుర్తింపు, మౌలిక వసతుల కల్పన తదితరాలపై సూచనలిచ్చారు. ★ ఏలూరు విడిది కార్యాలయంలో ఎంపీ మహేశ్ కుమార్‌ను ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గంలో అభివృద్ధిపై చర్చించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఏలూరు అర్బన్:	80085 74486	ఏలూరు టూటౌన్:	80085 74487
దెందులూరు:	80085 74535	పెదపాడు, పెదవేగి:	80085 74483
భీమడోలు:	80085 74527	నిడమర్రు గ్రామీణం:	97040 21765
ఉంగుటూరు:	94939 90333	గణపవరం:	99480 66777

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ? చాటపర్రు రోడ్డులోని వినాయక నగర్‌లో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. మురుగునీరు రోడ్డుపైకి చేరుతోంది. స్థానికులు దాని పైనుంచే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. **- రఘునాథరావు, స్థానికుడు**

✔ డ్రెయిన్‌లో పూడిక తీయిస్తాం. మురుగు రోడ్డుపైకి రాకుండా చూస్తాం. **- శ్రీనివాస్, నగర అదనపు కమిషనర్**

గుడిపాడు(పెదపాడు), న్యూస్‌టుడే: ? గుడిపాడు నుంచి వడ్డిగూడెం వెళ్లే ర.భ.శా. రహదారిని ఆనుకొని నిర్మించిన సంపద కేంద్రం వద్ద చెత్తాచెదారం పడేస్తున్నారు. గాలికి చెత్త ఎగిరి వాహనాలపై పడుతోంది. **- కాజ సుందర్, చోదకుడు**

✔ చెత్త వేయకుండా చూస్తాం. **- వసంతకుమారి, ఈవోపీఆర్డీ**

పెదవేగి, న్యూస్‌టుడే: ? అంకన్నగూడెం ఎస్సీ కాలనీలో విద్యుత్తు తీగలు చేతికందే ఎత్తులో ఉన్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయంగా ఉంటోంది. **- రాణి, గ్రామస్థురాలు**

✔ తీగలు సరిచేయిస్తాం. **- నరేంద్రబాబు, విద్యుత్తు ఏఈ**

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: ? క్రొవ్విడి ఎస్సీ కాలనీ సమీప రహదారి వెంబడి చెత్త పేరుకుపోయింది. దాన్ని తొలగించకపోవడంతో ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా మారుతోంది. **- శశికాంత్**

✔ చెత్తాచెదారం తొలగింపజేస్తాం. **- స్వామి, ఉప ఎంపీడీవో**

? నిడమర్రులోని పలు వీధుల్లో మురుగు కాలువలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోయి దుర్వాసన వస్తోంది. దోమల బెడద భరించలేకున్నాం. **- సురేశ్, స్థానికుడు**

✔ పారిశుద్ధ్యం మెరుగు పరుస్తాం. **- స్వామి, ఉప ఎంపీడీవో**

తుది జాబితా ప్రదర్శన

ఉంగుటూరు, న్యూస్‌టుడే: స్థానిక సంస్థల ఎన్నికలకు అందరికీ ఆమోదయోగ్యమైన పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేశామని ఎంపీడీవో రాజ్‌మనోజ్ తెలిపారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో పోలింగ్ కేంద్రాల తుది జాబితాను సోమవారం ప్రదర్శించారు. ఉప ఎంపీడీవో రమేశ్‌బాబు, సూపరింటెండెంట్ ఆంజనేయ బాబు పాల్గొన్నారు.

అధినేత పుట్టిన రోజుకు విస్తృత ఏర్పాట్లు

మాట్లాడుతున్న అప్పలనాయుడు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పుట్టిన రోజు నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామన్నారు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సెప్టెంబర్ 2న పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నగరంలో భారీ ద్విచక్ర వాహన ప్రదర్శన చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. పెద్దఎత్తున జనసేన శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

చంద్రబాబు పర్యటనను జయప్రదం చేద్దాం

కార్యకర్తలకు సూచనలిస్తున్న చంటి

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు అనకాపల్లి జిల్లా పర్యటనను విజయవంతం చేద్దామని తెదేపా జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే బడేటి చంటి పిలుపునిచ్చారు. ఈ నెల 2న పాయకరావుపేటలో గోదావరి జలాలకు చంద్రబాబు హారతినిచ్చే కార్యక్రమానికి హాజరవుతున్న నేపథ్యంలో.. చంటి పార్టీ పరిశీలకుడిగా నియమితులయ్యారు. అక్కడ రాష్ట్ర హోంశాఖ మంత్రి అనితతో కలిసి సీఎం పర్యటన ఏర్పాట్లపై చర్చించారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

హక్కులకు భంగం కలిగించొద్దు

పెదపాడు, న్యూస్‌టుడే: సమాజంలో అందరూ సమానులేనని.. ఎస్సీ, ఎస్టీల హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దారు ఆకుల కృష్ణజ్యోతి హెచ్చరించారు. స్థానిక కొండదొరల కాలనీలో జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీల హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. అనంతరం ఎస్సీ, ఎస్టీలకు ధ్రువపత్రాలు అందజేశారు.

ఎన్నిసార్లు రావాలి.. ఇంకెన్నిసార్లు ఇవ్వాలి

'మీ కోసం'లో బాధితుల వేడుకోలు

పవరుపేట(ఏలూరు కలెక్టరేట్), న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం జిల్లా, మండల, డివిజన్, పురపాలక కార్యాలయాల్లో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(మీ కోసం) నిర్వహిస్తోంది. ఇక్కడ అందజేసే అర్జీలకు పరిష్కారం లభించక ప్రజలు వేదనకు గురవుతున్నారు. ఒకే సమస్యపై పదేపదే వినతులు అందజేస్తున్నా. . ఫలితం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇరవై సార్లు దరఖాస్తు చేశా.. నా పేరు పీవీవీ సత్యనారాయణ వరప్రసాదరావు. మాది జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి గ్రామం. నా వయసు 74 ఏళ్లు. 2017లో జారీ చేసిన ఆర్ అండ్ ఆర్ ప్రకటన ప్రకారం నాకున్న 7.14 ఎకరాల భూమిని 2018లో అవార్డు చేశారు. నేటికీ నష్టపరిహారం అందలేదు. ఇప్పటి వరకు పీజీఆర్ఎస్‌లో 20 సార్లు దరఖాస్తు చేశా. నాతో పాటు మరో వ్యక్తికి చెందిన 1.50 ఎకరాల భూమి కేసు కోర్టులో ఉంది. మా ఇద్దరి భూమి పీఎన్ అండ్ డీఎన్‌లో వేర్వేరుగా ఉండగా.. ఒకే అవార్డులో కలిపారు. అధికారుల తప్పిదంతో ఎనిమిదేళ్లుగా నష్టపరిహారం రాలేదు.

రోడ్డు ఆక్రమించి..

నా పేరు వి.కోటేశ్వరరావు. మాది భీమడోలు మండలం గుండుగొలను. మా గ్రామంలోని పెత్తందారి వీధిలో రోడ్డును ఆక్రమించి ప్రహరీ నిర్మిస్తున్నారు. రహదారి నిర్మాణానికి ఏళ్లుగా పోరాడితే ప్రభుత్వం రూ.16.5 లక్షలు మంజూరు చేసింది. దారి ఆక్రమణ కారణంగా రోడ్డు నిర్మాణం ఆలస్యమవుతోంది. సమస్య పరిష్కరించాలని పీజీఆర్ఎస్‌లో నాలుగు సార్లు వినతిపత్రాలు అందజేశా. ఇప్పటికీ స్పందన లేదు.

మరికొన్ని వెతలిలా..

☛ తమ గ్రామంలో సాగు భూములకు నీరందించే పంట బోదె ఆక్రమణకు గురైందని దెందులూరుకు చెందిన కె.త్రిలోనాథ చౌదరి ఫిర్యాదు చేశారు. ☛ ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ, ఇతర బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ ఏపీ ఐకాస అమరావతి జిల్లా ఛైర్మన్ కె.రమేశ్‌కుమార్ తదితరులు కోరారు. ☛ 'ఆడుదాం ఆంధ్రా'లో నిధుల దుర్వినియోగంపై విచారణ చేయించాలని భాజపా నాయకుడు బి.నారాయణరావు వినతిపత్రం ఇచ్చారు. ☛ రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సీహెచ్ కట్లయ్య విజ్ఞప్తి చేశారు. ☛ తాగునీటి కనెక్షనుకు దరఖాస్తు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఏలూరుకు చెందిన వెంకటరమణ ఫిర్యాదు చేశారు.

కుక్కలు కరుస్తూ.. కోతులు తరుముతూ!

ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు

నారాయణపురం(ఉంగుటూరు), న్యూస్‌టుడే: దారుల్లో శునకాలు, నివాస ప్రాంతాల్లో కోతులు జనాలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఒంటరిగా బయటకు వెళ్లాలంటేనే హడలిపోతున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో కోతులు, శునకాల స్వైర విహారం ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రజలు రోడ్లపైకి రావాలంటే జంకుతున్నారు. వీటిని నియంత్రించడంలో పంచాయతీ, పశుసంవర్ధక శాఖాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి.

ఉంగుటూరు మండలం నారాయణపురంలో గణపవరానికి వెళ్లే ర.భ.శా. రహదారిపై కుక్కల బెడద ఎక్కువ ఉంటోంది. 13, 14 వార్డులు, కోదండ రామాలయం, టూరింగ్‌పేట, జడ్పీ ఉన్నత పాఠశాల తదితర ప్రాంతాల్లోనూ పదుల సంఖ్యలో కుక్కలు సంచరిస్తున్నాయి. పిల్లలు, వృద్ధులు, మహిళలపై దాడి చేస్తున్నాయి. ద్విచక్ర వాహనదారులను వెంబడిస్తున్నాయి.

ఎక్కడ చూసినా..

ఉంగుటూరు మండలం నారాయణపురం, కైకరం, ఉంగుటూరు, చేబ్రోలు, రాచూరు, బాదంపూడి, నీలాద్రిపురం; భీమడోలు మండలం గుండుగొలను, సూరప్పగూడెం, పూళ్ల, భీమడోలు; గణపవరం మండలం సరిపల్లి, పిప్పర, మొయ్యేరు, గణపవరం; నిడమర్రు మండంలో తోకలపల్లి, నిడమర్రు, బువ్వనపల్లి, పెదనింద్రకొలను తదితర గ్రామాల్లో కుక్కల బెడద నిత్యకృత్యమైంది. ప్రధాన రహదారులతో పాటు ఏ వీధి చూసినా గుంపులుగా సంచరిస్తున్నాయి. చిన్నారులు, మహిళలు బయటకు వెళ్లాలంటే భయపడే పరిస్థితి. ద్విచక్ర వాహనాల వెంటపడుతుండటంతో.. చోదకులు అదుపు తప్పి పడి గాయాల పాలవుతున్నారు.

> ఉంగుటూరులో వారం రోజుల వ్యవధిలో ఇద్దరు మహిళలపై కోతులు దాడి చేశాయి. దాంతో మహిళలు ఒంటరిగా బయటకు రావడానికి భయపడుతున్నారు.

ఇళ్లలోకి చొరబడి..

వనాల్లోని వానరాలు గ్రామాల్లోకి వచ్చి బెంబేలెత్తిస్తున్నాయి. ఇళ్లలోకి చొరబడి దొరికినవి ఎత్తుకుపోవడం, చేతిలో ఉన్నవి లాక్కుని పరుగులు తీస్తున్నాయి. వానర మూకల కారణంగా పలు గ్రామాల ప్రజలకు కంటి మీద కునుకు కరవైంది. ఇటీవల కాలంలో కోతుల సంఖ్య గణనీయంగా పెరగడంతో సమస్య తీవ్ర రూపం దాల్చింది. ఇంటి పైకప్పులు, టీవీ డిష్‌లు ధ్వంసం చేస్తున్నాయి. ఉంగుటూరు, నారాయణపురంలో ఇటీవల పలువురిని కరిచి గాయపరిచాయి.

పార్థసారథిని సన్మానిస్తున్న అతిథులు

సాహిత్య వికాసానికి కవి సమ్మేళనాలు దోహదం

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: సాహిత్య వికాసం, తెలుగు భాషాభివృద్ధికి కవి సమ్మేళనాలు దోహదపడతాయని శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ ఛైర్మన్ కత్తిమండ ప్రతాప్ కుమార్ అన్నారు. నగరంలో హేలాపురి లయన్స్‌క్లబ్, శ్రీశ్రీ కళావేదిక సంయుక్త ఆధ్వర్యాన సోమవారం జాతీయ శతాధిక కవి సమ్మేళనం నిర్వహించారు. లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ డాక్టర్ జి.సుబ్బారావు అధ్యక్షత వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కవులు సామాజిక చైతన్యం, తెలుగు భాషా వైభవం, సాహిత్య విలువలు తదితర అంశాలపై కవితలు వినిపించారు. కవి శ్రీనివాస్ వాసుదేవ్ రచించిన జాతర పుస్తకానికి అత్యుత్తమ పురస్కారం, ప్రముఖ కవి శ్రీనాథుడి వంశీయులు డాక్టర్ కావూరి శ్రీనివాస శర్మ, శ్రీశ్రీ కళావేదిక జాతీయ ప్రణాళిక అధికారి డాక్టర్ టి.పార్థసారథి, శ్రీహరికోటిలకు గిడుగు జాతీయ సేవా పురస్కారాలు ప్రదానం చేశారు.

భాజపాతోనే దేశాభివృద్ధి

నినాదాలు చేస్తున్న నాయకులు

తల్లాపురం(ఉంగుటూరు), న్యూస్‌టుడే: కేంద్రంలోని భాజపాతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిశోర్ అన్నారు. తల్లాపురంలో 'మన ఊరు-మన జెండా' కార్యక్రమం సోమవారం నిర్వహించారు. తొలుత పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి చిలుకూరి రామ్ కుమార్‌తో కలిసి పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా భాజపా నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీ రాణి ఆధ్వర్యంలో పలువురు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. నాయకులు బొల్లిన నిర్మల కిశోర్, దుర్గారావు, అడపా శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు పీజీఆర్ఎస్‌కు 45 ఫిర్యాదులు: ఎస్పీ

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామన్నారు ఎస్పీ ప్రతాప్ శివకిశోర్. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదు పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చి తమ సమస్యలపై అర్జీలు సమర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ.. దూర ప్రాంతాల నుంచి ఇక్కడికి రావాల్సిన అవసరం లేదని, ఆన్‌లైన్‌లోనూ మీ కోసం పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. మొత్తం 45 ఫిర్యాదులు అందాయని, అందులో భూ వివాదాలు, కుటుంబ తగాదాలు, ఆర్థిక మోసాలపై ఎక్కువ అర్జీలు వచ్చాయని ఆయన తెలిపారు.

అధికారులతో సమీక్షిస్తున్న వెట్రిసెల్వి, చిత్రంలో ప్రతాప్ శివకిశోర్

గుత్తేదారులు నిర్లక్ష్యం వహిస్తే కేసులు: కలెక్టర్

పవరుపేట(ఏలూరు కలెక్టరేట్), న్యూస్‌టుడే: రహదారుల నిర్మాణం, మరమ్మతుల సమయంలో గుత్తేదారుల నిర్లక్ష్యం వహించినా, మరణాలు సంభవించినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కలెక్టర్ వెట్రిసెల్వి హెచ్చరించారు. స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఉంగుటూరు- బాదంపూడి మధ్య రహదారికి మరమ్మతులపుడు సరైన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ఒకరు మృతి చెందారన్నారు. శిరస్త్రాణం ధరించినా, గుత్తేదారు నిర్లక్ష్యంతో ప్రాణాలు కోల్పోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ గుత్తేదారుపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు చెప్పారు. జాతీయ రహదారులపై ప్రమాదాలకు కారణమవుతున్న ఆక్రమణలు తొలగించాలని ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ సూచించారు. రవాణా శాఖాధికారి శేఖర్, డీపీవో మల్లికార్జునరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేస్తేనే మన్ననలు

దంపతులను సత్కరిస్తున్న వీరాంజనేయులు

గణపవరం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగులు అంకితభావంతో పని చేస్తేనే ప్రజల నుంచి మన్ననలు లభిస్తాయన్నారు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయ ప్రాంగణంలో ఎంపీడీవో పీవీ సత్యనారాయణ ఉద్యోగ విరమణ సభను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటూ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పారదర్శకంగా అమలు చేశారని కొనియాడారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పొత్తూరి కృష్ణంరాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నిరంతర సేవకుడు పవన్ కల్యాణ్

పూజలు చేస్తున్న వెంకటలక్ష్మి తదితరులు

పెదవేగి, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిరంతర ప్రజా సేవకుడు అని రాష్ట్ర వడ్డీలు సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఘంటసాల వెంకటలక్ష్మి అన్నారు. కవ్వగుంట శివాలయంలో దెందులూరు ఏఎంసీ డైరెక్టర్ పసుపులేటి భార్గవ్ ఆధ్వర్యాన సోమవారం మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, మృత్యుంజయ ఆయుష్య హవనం నిర్వహించారు. నాయకులు రాజేష్, కృష్ణ, ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: నగర శివారు శనివారపుపేటకు చెందిన పువ్వుల సింహాచలం(58) తాపీ పనులు చేస్తుంటారు. ఈయన గత నెల 28న గ్రామంలో రోడ్డు దాటుతుండగా. . ద్విచక్ర వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆయన్ను స్థానికులు సర్వజన ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు విజయవాడ తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

ఏలూరు నేరవార్తలు: స్థానిక హనుమాన్‌నగర్ శ్రీగార్డెన్స్‌కు చెందిన మెట్లపల్లి ఉమామహేశ్వరరావు, అతడి భార్య వెంకటలక్ష్మి గత నెల 30వ తేదీ రాత్రి నగర శివారు ప్రాంతంలో ఓ పెళ్లికి వెళ్లారు. ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి వస్తుండగా.. మినీ బైపాస్ గ్రీను సిటీ సమీప వేగ నిరోధకం వద్ద ద్విచక్ర వాహనంపై వచ్చిన ఆగంతుకుడు వెంకటలక్ష్మి మెడలోని పది కాసుల నల్లపూసల గొలుసు లాక్కెళ్లాడు. బాధితుల ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసులు సోమవారం రాత్రి కేసు నమోదు చేశారు.

డ్రైవర్ నిర్లక్ష్యం.. ముగ్గురికి గాయాలు

కైకరం(ఉంగుటూరు): తెనాలికి చెందిన కౌరుగిరి వేణు, శేషమ్మ దంపతులు బతుకుదెరువు కోసం కొన్నేళ్ల కిందట కైకరం వచ్చారు. స్థానికంగా ఓ పాత ఇనుము కొనుగోలు దుకాణంలో పని చేస్తూ ఇక్కడే నివాసముంటున్నారు. ఆదివారం రాత్రి డ్రైవర్ నిర్లక్ష్యంగా లారీ వెనక్కి తీయడంతో రిక్షాపై కూర్చున్న వేణు, పక్కనే నిల్చొని ఉన్న శేషమ్మ, కుమార్తె తిరపతమ్మలకు గాయాలయ్యాయి. వారిని స్థానికులు తాడేపల్లిగూడెం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.

బస్సు నుంచి జారి పడిన వృద్ధురాలు.. నారాయణపురం: చేబ్రోలుకు చెందిన వృద్ధురాలు భీమవరం వెళ్లేందుకు సోమవారం సాయంత్రం జంగారెడ్డిగూడెం డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు ఎక్కారు. రైల్వే గేటు సమీపాన బస్సు మలుపు తిరుగుతుండగా వృద్ధురాలు కింద పడిపోయి గాయపడ్డారు. ఆమెను స్థానికంగా ఓ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

యువతి అదృశ్యం

పెదవేగి: మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి ఏలూరులోని ప్రైవేట్ బ్యాంకులో పని చేస్తున్నారు. ద్విచక్ర వాహనం నేర్చుకునేందుకు ఆదివారం రాత్రి ఇంటి నుంచి బయటకెళ్లిన ఆమె తిరిగి కాలేదు. కుటుంబ సభ్యులు గాలించగా.. ముండూరు పోలవరం వంతెన వద్ద ద్విచక్ర వాహనం, ఫోన్‌ను గుర్తించారు. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రైల్వే పట్టాలపై ఆగిన లారీ

ఉంగుటూరు: స్థానిక రైల్వే గేటు వద్ద పట్టాలపై సోమవారం లారీ నిలిచిపోయింది. నీలాద్రిపురం రోడ్డు నుంచి జాతీయ రహదారి పైకి లారీ వస్తుండగా.. డీజిల్ అయిపోయి ఆగిపోయింది. డ్రైవర్ అప్రమత్తమై స్థానికుల సాయంతో డీజిల్ తీసుకొచ్చి పోసి లారీని ముందుకు నడిపారు. ఈ సమయంలో రైళ్లు రాకపోవడంతో ప్రమాదం తప్పింది.

(c) eenadu

చింతలపూడి
• చింతలపూడి • పోలవరం

చవితి ఉత్సవాల నిర్వహణకు అనుమతి తప్పనిసరి

పోలవరం, న్యూస్‌టుడే: చవితి ఉత్సవాలు నిర్వహించే కమిటీ సభ్యులు తప్పని సరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని పోలవరం ఎస్సై పి.అప్పారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తప్పని సరిగా సీసీ టీవీలు మండపాల వద్ద ఏర్పాటు చేయాలని నిమజ్జనం చేసే ముందు రూటు మ్యాప్ పోలీసులకు తప్పని సరిగా అందజేయాలని ఎస్సై పేర్కొన్నారు.

యూపీఏ నూతన కార్యవర్గం ఎంపిక

టి.నరసాపురం, న్యూస్‌టుడే: యునైటెడ్ పాస్టర్స్ అసోషియేషన్ మండల నూతన కార్యవర్గం ఎంపిక మక్రిగూడెంలో సోమవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా బి.అనిల్ కుమార్, ఉపాధ్యక్షుడిగా వి.శ్యాంప్రసాదు, కార్యదర్శిగా జి.జ్ఞానరాజు, కోశాధికారిగా పి.ప్రసాదు ఇతర సభ్యులు ఎన్నికయ్యారు.

పోలింగ్ కేంద్రాల్లో జాబితాల ప్రదర్శన

జీలుగుమిల్లి, న్యూస్‌టుడే: మండలంలోని 12 పంచాయతీల్లోని అన్ని పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన తుది జాబితా సోమవారం నోటీసు బోర్డులపై ప్రదర్శించారు. మొత్తం 122 వార్డులకు గాను, 122 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి ఆయా పంచాయతీ, మండల పరిషత్ కార్యాలయాల నోటీసు బోర్డులపై జాబితాలను ప్రజల పరిశీలనార్థం ఉంచినట్లు ఎంపీడీవో కె.వెంకటలక్ష్మి తెలిపారు.

రసలింగేశ్వరుడికి కుంకుమార్చన

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: శ్రావణ మాసం సోమవారం సందర్భంగా కన్నాపురం రసలింగేశ్వరస్వామి ఆలయంలో 5 కిలోల కుంకుమతో భక్తులు స్వామిని అభిషేకించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

లలితాదేవికి బోనాలు

బోనాలతో వెళ్తున్న మహిళలు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే : గ్రామం సుభిక్షంగా ఉండి, పాడి పంటలు సంవృద్ధిగా పండాలని ఆకాంక్షిస్తూ లలితా దేవి ఆలయంలో మహిళలు లలితా దేవి, కామేశ్వరి అమ్మవార్లకు సోమవారం బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా అర్చకుల ఆధ్వర్యంలో మహిళలు పట్టణంలోని 9 దేవాలయాలకు బోనాలతో గ్రామోత్సవం నిర్వహించి, గంగానమ్మకు సమర్పించారు.

6 నుంచి దివ్య పవిత్రోత్సవాలు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవారి దత్తత దేవాలయమైన లక్ష్మీపురం శ్రీవేంకటేశ్వర సంతాన వేణుగోపాల జగన్నాథస్వామి ఆలయంలో ఈ 6 నుంచి 9 వరకు దివ్య పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో వేండ్ర త్రినాథరావు తెలిపారు.

ప్రజా సమస్యలపై అర్జీలు

వినతి పరిశీలిస్తున్న ఆర్డీవో కార్యాలయం డీటీ

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై సోమవారం ఆర్డీవో కార్యాలయంలో జరిగిన మీకోసంలో పలు అర్జీలు అందించారు. కార్యాలయ డీటీ సోమశేఖరరావు వాటిని తీసుకున్నారు. లక్కవరం గ్రామంలోని 394 సర్వే నంబరులో ఉన్న తన భూమి రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అనుమతి ఇప్పించాలని పేరంపేటకు చెందిన గోలి నర్సిరెడ్డి దరఖాస్తు చేశారు. రామానుజపురంలోని ఎకరం భూమిని వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయాలని ఆదినా వెంకటరమణ కోరారు. రోడ్డు ప్రమాదంలో తన కుమారుడు మనోహర్ మృతి చెందారని జీలుగుమిల్లికి చెందిన గుమ్మాపు సద్గురు శ్యాంప్రసాద్ అర్జీ ఇచ్చారు. వృద్ధాప్యంలో ఉన్న తాము జీవనాధారం కోల్పోయామని, కుమారుడు మనోహర్ పేరున సెటిల్‌మెంట్ డీడ్ ద్వారా రిజిస్టరు చేసిన ఆస్తులను తిరిగి తన పేరున మార్చాలని కోరుతూ ఈయన ఆర్డీవోకు విన్నవించారు. తనపై దౌర్జన్యం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని తలారి ప్రకాశ్ ఫిర్యాదు చేశారు. పేరంపేటలోని 204 సర్వే నంబరులో 7.10 ఎకరాలకు రీసర్వేలో 5.15 ఎకరాలు నమోదు చేశారు.. సరిచేయాలని తోట గంగరాజు ఫిర్యాదు చేశారు. పేరంపేటలో రీసర్వేలో 424 సర్వే నంబరు భూమి వద్ద తప్పుగా చేశారని చిలపరెడ్డి వెంకటరెడ్డి ఫిర్యాదు చేశారు.

పోలవరం.. పుష్కరాలకు దూరం..

ఘాట్ల నిర్మాణానికి నెక్లస్ బండ్ ఆటంకం

గ్రామానికి వరద నుంచి రక్షణ కోసం వేసిన రాళ్లు

పోలవరం, న్యూస్‌టుడే: రానున్న గోదావరి పుష్కరాలకు పవిత్రస్నానాలు ఆచరించాలంటే కనీసం ఒక్కటంటే ఒక్కటి కూడా స్నాన ఘట్టం లేదని పోలవరం ప్రజలు ఆవేదన చెందుతున్నారు. పక్కనే గోదావరి ప్రవహిస్తున్నా.. స్నానాలకు ఎక్కడో మరో గ్రామానికి వెళ్లాల్సి వస్తోందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. పుష్కరాలకు రూ.కోట్లు వెచ్చిస్తోన్న కూటమి ప్రభుత్వం తమ ఆవేదన పట్టించుకోవాలని కోరుతున్నారు.

నీళ్లు నెత్తిన చల్లుకోవడమే గతి..

నియోజకవర్గ కేంద్రం, మండల కేంద్రంగా ఉన్న పోలవరం పంచాయతీ జనాభా 12 వేలు. నెక్లెస్ బండ్ నెపంతో పుష్కర ఘాట్ల నిర్మాణంపై అధికారులు శీతకన్ను వేయడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. గోదావరిలో పుణ్యస్నానాలకు పది కి.మీ. దూరంలోని పట్టిసీమ రేవుకు వెళ్లాల్సి వస్తోందని, అంతదూరం వెళ్లలేక గోదావరి నీళ్లు నెత్తిన జల్లుకుని సరిపెట్టుకుంటున్నారు. గూటాల, పట్టిసీమ రేవుల్లో ఘాట్ల అభివృద్ధికి సుమారు రూ.7 కోట్లు మంజూరు చేసిన అధికారులు పోలవరాన్ని పూర్తిగా విస్మరించారు.

✪ ఘాట్ల నిర్మాణం విషయమై గోదావరి హెడ్‌వర్క్స్ ఈఈ శ్రీనివాస్‌ను సంప్రదించగా పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

తప్పని ఇక్కట్లు..

గ్రామానికి వరద నుంచి రక్షణ కోసం 2004లో మూడు కిలోమీటర్ల పొడవునా గట్టు(నెక్లెస్‌బండ్) నిర్మించడంతో స్థానికులకు అవస్థలు మొదలయ్యాయి. 2019-21 వరకు ప్రమాదకర స్థాయిలో వచ్చిన వరదలతో మొదటిసారిగా గట్టుకు ఎక్కడ గండి పడుతుందోనన్న భయంతో గ్రామస్థులతోపాటు జిల్లా అధికారులకు కంటి మీద కునుకులేకుండా పోయింది. గ్రామంలో గట్టు వెంబడి ఒకటిన్నర కిలోమీటర్ల పొడవునా రాళ్లు వేసి వదిలేయడంతో స్థానికులకు గోదావరితో సంబంధాలు తెగిపోయాయి. రాళ్ల మధ్య ఎక్కి దిగలేక, ప్రమాదాల భయంతో గోదారి స్నానాలకు స్వస్తి పలికారు. గ్రామంలో ఎవరైనా మరణిస్తే గోదావరి ఒడ్డుకు తీసుకువెళ్లి కనీసం అంత్యక్రియలు చేద్దామంటే నెక్లెస్‌బండ్ కారణంగా ఆ పరిస్థితి లేదని, శ్మశానవాటిక లేకపోవడంతో ఇతర గ్రామాలకు, మండలాలకు వాహనంపై తరలించాల్సిన దుర్భర పరిస్థితిని ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

10 AM to 1 PM మేమున్నాం.. మీకు తోడుగా..
జంగారెడ్డిగూడెం: 80085 74478
కొయ్యలగూడెం: 80085 74947
చింతలపూడి: 76759 19086

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: ? చింతలపూడి పట్టణం కూరగాయల మార్కెట్ వెనుకవీధిలో మురుగు నీరు కదలడం లేదు. ఇబ్బంది పడుతున్నాం.
- బుచ్చిబాబు, కొవ్వూరిగూడెం.

✔ మురుగు నీరు ప్రవహించే విధంగా చర్యలు తీసుకుంటాం. - రాంబాబు, నగర పంచాయతీ కమిషనర్.

డీటీ రమేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

'అన్యాక్రాంత భూములను సేకరించవద్దు'

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: అక్రమంగా అన్యాక్రాంతం చేసిన తమ భూములను ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద సేకరించవద్దని కోరుతూ బుట్టాయగూడెం మండలం కుమ్మరికుంట గ్రామానికి చెందిన గిరిజనులు బుట్టాయగూడెం తహసీల్దారు కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. అఖిల భారత ఆదివాసీ వేదిక జాతీయ కన్వీనర్ సరియం రామ్మోహన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ పూరీకుల నుంచి సంక్రమించిన 34 ఎకరాల భూమిని 17 మంది గిరిజనులు ఆరు దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్నారన్నారు. ఈ భూమిని రామన్నగూడెనికి చెందిన గిరిజనేతరులు అన్యాక్రాంతం చేసి అక్రమంగా ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్యాకేజీలో పెట్టకుండా అధికారులు గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు. ఈ భూములకు సంబంధించిన గిరిజనులకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని కోరారు. అనంతరం ఉప తహసీల్దారు పాయం రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు.

ఇచ్చిన హామీని నెలబెట్టుకున్నాం : ఎమ్మెల్యే

వెలమపేటలో కూటమి నాయకులతో కలిసి సీసీ రహదారికి శంకుస్థాపన చేసిన రోషన్ కుమార్

చింతలపూడి, న్యూస్‌టుడే: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు పట్టణంలో సీసీ రహదారుల నిర్మాణం పూర్తిచేయబోతున్నామని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని వెలమపేటలో రూ.47 లక్షలతో చేపట్టే సీసీ రహదారుల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో నూరు శాతం సీసీ రోడ్ల నిర్మాణానికి కృషిచేస్తున్నామని చెప్పారు. దాదాపు రూ.20 కోట్లతో పట్టణంలో సీసీ రహదారులు, డ్రెయిన్ల నిర్మాణ పనులు చేపడుతున్నామని వెల్లడించారు. తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి జగ్గవరపు ముత్తారెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు చీదరాల మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

బోరు ఏర్పాటు పనులు ప్రారంభం

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: పట్టణంలోని బాలాజీనగర్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్య ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ చొరవతో పరిష్కారమైందని తెదేపా పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిశోర్ తెలిపారు. సోమవారం ఇంటింటికీ తెదేపా కార్యక్రమంలో భాగంగా తాము ఈ ప్రాంతంలో పర్యటించిన సమయంలో తాగునీటి ఇబ్బందిని గుర్తించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామన్నారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే రోషన్‌కుమార్ పురపాలక కమిషనర్ కె.వి.రమణను బోరు వేయాలని ఆదేశించారన్నారు. ఈ క్రమంలోనే కొత్తగా మంజూరైన బోరు నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించినట్లు కిశోర్ తెలిపారు. తెదేపా పట్టణ కార్యదర్శి కోనేటి వంటి, సీనియర్ నాయకులు పెనుమర్తి రామ్‌కుమార్, చేను ప్రసాద్, ఉర్రి సూరిబాబు, చిక్కాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఉపయోగపడేలా పవన్ జన్మదిన వేడుకలు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలరాజు

జీలుగుమిల్లి, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సూచించారు. ఈ మేరకు బర్రింకలపాడులోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 2న మండల కేంద్రాలతోపాటు అన్ని గ్రామాల్లో భారీ ప్రదర్శనలు, నిరుపేదలకు ఉపయోగపడే విధంగా సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

పరిహారం చెల్లించాకే రీ-సర్వే

సత్యసాయిబాబాకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

టి.నరసాపురం, న్యూస్‌టుడే: చింతలపూడి ఎత్తిపోతల పథకంలో కోల్పోతున్న తమ భూములకు పరిహారం చెల్లించాకే రీసర్వే జరపాలని పలువురు రైతులు కోరారు. టి.నరసాపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం కొద్దిసేపు ఆందోళన చేసి, డీటీ సత్యసాయిబాబాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు రీ-సర్వే చేస్తూ, ఎటువంటి లబ్ధి పొందని తమ భూములను ప్రభుత్వ భూములుగా చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పరిహారం చెల్లించే వరకు తమ భూ హక్కు ధ్రువీకరణ మార్చవద్దని కోరారు.

పబ్లిక్ నోటీస్

నా క్లయింట్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం రోడ్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ గారి సంజాయిషీ ప్రకారం తెలియజేయునది ఏమనగా.

జంగారెడ్డిగూడెంకు చెందిన కొండబత్తుల నరేంద్ర, S/o. సత్యనారాయణ అనువారు గృహ ఋణము నిమిత్తం నా క్లయింట్ బ్యాంకుకు వచ్చియున్నారు. వీరు దివాకర్ సింగ్ అను వారి వద్ద తేది: 06-03-2025 తేదిన 250 చ॥గ॥ల స్థలం కొనుగోలు చేసి జంగారెడ్డిగూడెం SRO నందు డాక్యుమెంట్ నెం: 2195/2025గా రిజిష్టర్ చేయించుకొనియున్నారు. ఆ సమయంలో సదరు స్థలమునకు సంబంధించి అన్ని లింకు డాక్యుమెంట్స్ ఇచ్చియున్నారు. ది. 30-07-2026 తేదిన బుట్టాయగూడెం రోడ్‌లో మీసేవా కేంద్రం వద్ద నుండి జిరాక్స్ తీసుకుని ఇంటికి వెళ్ళుచుండగా 97/2020 డాక్యుమెంట్ పోగొట్టుకున్నట్లు పేపరు ప్రకటన చేసి జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేయగా పోలీస్ వారి విధి విధానాలను పాటిస్తూ వారు తాము ఎంత ప్రయత్నించినప్పటికీ సదరు 97/2020 డాక్యుమెంట్ ఆచూకీ లభించలేదని ఎస్.హెచ్.ఒ ఒక ధృవీకరణ పత్రం ఇచ్చినారు. ఆ విషయముపై మరియు దిగువ షెడ్యూల్ ఆస్తిపై ఎవరికైననూ ఏదైనా అభ్యంతరములు ఉన్న యెడల ఈ రోజు నుండి 15 రోజుల లోపుగా నా క్లయింటుకు తెలియపరచగలరు.

షెడ్యూలు: ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం పట్టణంలోని R.S.No. 622/2,3,5,6,8లో ప్లాట్ నెం. 21, 23, 24, 25 లోని 250 చ॥గ॥ స్థలమునకు హద్దులు:
తూర్పు: 40 అడుగుల రోడ్డు, **ఉత్తరం:** ప్లాట్ నెం. 21A, 22, **పడమర:** S.పెద్దిలమ్మ ఇతరుల స్థలం, **దక్షిణం:** ప్లాట్ నెం. 23, ఓలేటి శ్రీహరిగారి స్థలం.

Sd/- **MEKALA RAMA MOHANA RAO,** B.Com., B.L.
ADVOCATE, JANGAREDDIGUDEM, Ph: 91103 72346.

ఇలా ఉంటే.. గోదారే

మట్టిలో కూరుకుపోయిన మెట్లు

వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: వేలేరుపాడు మండలంలోని తాట్కూరుగొమ్ము గ్రామంలోని గోదావరి ఒడ్డున ఉన్న మెట్లు పరిస్థితి ఇదీ. 2022లో సంభవించిన గోదావరి వరదలకు ఇలా తయారైంది. ఆవలి వైపున్న ప్రసిద్ధి చెందిన శ్రీరామగిరి దేవాలయానికి భక్తులు ఈ మెట్లు దిగి పడవపై వెళ్లాలి. ప్రస్తుతం మట్టితో పూడిపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

పారిశుద్ధ్యం కనుమరుగు!

రహదారిపై మురుగు

జీలుగుమిల్లి, న్యూస్‌టుడే: జీలుగుమిల్లి మండలం తాటియాకులగూడెంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉంది. గ్రామంలోని పలు వీధుల్లో సీసీ రహదారులు ఏర్పాటు చేసినప్పటికీ డ్రెయిన్లు నిర్మించకపోవడంతో ఇళ్లలోని మురుగునీరు రహదారులపై ప్రవహిస్తోంది. దీంతోపాటు ఇళ్ల పరిసరాల్లో చెత్త పేరుకుపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు విజృంభించి కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. దోమకాటుకు గురైన అనేక మంది మలేరియా, టైఫాయిడ్ జ్వరాల బారిన పడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పారిశుద్ధ్య పనులు చేయించాలని పలువురు కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి మాట్లాడుతూ.. వెంటనే మురుగునీటిని తొలగించడంతోపాటు బ్లీచింగ్ చల్లిస్తామన్నారు.

నిందితుడ్ని కఠినంగా శిక్షించాలి

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో నర్సుగా పనిచేస్తున్న గిరిజన యువతిపై అత్యాచారం చేసి కిరాతకంగా హత్య చేసిన నిందితుడ్ని కఠినంగా శిక్షించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బన్నే వినోద్ కోరారు. బుట్టాయగూడెంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మహిళా రక్షణ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు.

దీర్ఘకాలంగా విధులకు గైర్హాజరు

ఉపాధ్యాయుడిపై చర్యలకు సిద్ధం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: దీర్ఘకాలంగా విధులకు గైర్హాజరవుతున్న ఉపాధ్యాయుడిపై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నారు. వేలేరుపాడు మండలం రుద్రమకోట ఎంపీపీ పాఠశాలలో ఎస్జీటీగా పని చేస్తున్న మల్లం శ్రీను 2025 జులై 18 నుంచి ఇప్పటి వరకు విధులకు హాజరు కావడం లేదు. అతడి చిరునామా, అందుబాటులోని ఫోన్ నంబరు, కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చినా.. నేటికీ అందుబాటులోకి రాలేదని డీఈవో వెంకట లక్ష్మమ్మ తెలిపారు. ఉపాధ్యాయుడికి పలుమార్లు షోకాజ్ నోటీసులు, ఆర్టికల్స్ ఆఫ్ ఛార్జెస్ తదితర తాకీదులిచ్చినా.. ఎలాంటి వివరణ ఇవ్వలేదని చెప్పారు. అధికారుల ద్వారా ఆచూకీ తెలుసుకునేందుకు ప్రయత్నించినా, అందుబాటులోకి రాలేదన్నారు. దీర్ఘకాలంగా విధులకు గైర్హాజరవ్వడాన్ని తీవ్రంగా పరిగణిస్తూ.. సీసీఏ నిబంధనల ప్రకారం ఉపాధ్యాయుడిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడానికి, అవసరమైతే సర్వీసు నుంచి తొలగించడానికి చర్యలు చేపడతామని ఆమె పేర్కొన్నారు.

ఇద్దరి బైండోవర్

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: చింతలపూడి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో నాటుసారా స్థావరాలపై దాడులు చేసినట్లు సీఐ అశోక్ తెలిపారు. ఈ దాడుల్లో చింతలపూడి మండలం నామవరంలో సారా తరలిస్తున్న రవీంద్రనాయక్ అనే వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. లింగపాలెం మండలం వెస్ట్ యడవల్లికి చెందిన వీరయ్య, మణెమ్మ అనే ఇద్దరు పాత నిందతులను తహసీల్దార్ ఎదుట హాజరుపరచగా వారిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

మాట్లాడుతున్న క్రాంతికుమార్

జీలుగుమిల్లి, న్యూస్‌టుడే: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సై వి.క్రాంతికుమార్ సూచించారు. బర్రింకలపాడులోని గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు అపరిచిత లింక్‌లు తెరవకపోవడంతో పాటు చరవాణి సందేశాలు, కాల్స్, ఓటీపీలు, వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోకూడదన్నారు. దేశంలో కొత్తగా అమల్లోకి వచ్చిన భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్ష(బీఎన్ఎస్ఎస్) చట్టాలపై విద్యార్థులు కనీస అవగాహన కలిగి ఉండాలన్నారు. మత్తు పదార్థాల వాడకం వలన కలిగే అనర్థాలు, మహిళలు, బాలికల భద్రతకు సంబంధించిన శక్తి యాప్ వినియోగంపై వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ శ్రీపాద రామకృష్ణ, విఠల్, సిబ్బంది జయకరజాన్సన్, సత్యమూర్తి, రమేశ్ పాల్గొన్నారు.

సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులు ఆరంభం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల మండలం జి.కొత్తపల్లిలో సీసీ డ్రెయిన్‌ల నిర్మాణ పనులు స్థానిక సొసైటీ ఛైర్మన్ రేగంటి రాంబాబు సోమవారం ప్రారంభించారు. గ్రామంలో డ్రెయినేజీ అధ్వానంగా మారడంతో స్థానిక ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు స్పందించి సీసీ డ్రెయిన్ నిర్మాణం కోసం రూ.20లక్షలు మంజూరు చేయించారు. ఈ పనులను రేగంటి రాంబాబు కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి రేగంటి వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ ఘంటా నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు చలో విజయవాడ

చింతలపూడి, న్యూస్‌టుడే: సెప్టెంబర్ ఒకటిన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు తలపెట్టిన చలో విజయవాడ జయప్రదం చేయాలని ఉద్యోగులు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం 'చలో విజయవాడ' గోడపత్రాలను చింతలపూడిలో ప్రదర్శించారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, సీపీఎస్ రద్దు చేసి పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని ఈ సందర్భంగా కోరారు.

గోడపత్రాలు ప్రదర్శిస్తున్న ఉద్యోగులు

ఆర్థిక వ్యవస్థకు పరిశ్రమలు వెన్నెముక

కామవరపుకోట, న్యూస్‌టుడే: దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి చిన్న తరహా పరిశ్రమలు వెన్నెముకగా నిలుస్తాయని కామర్స్ అధ్యాపకురాలు సుశ్యలత వివరించారు. అన్నారు. సోమవారం కామవరపుకోట డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు చిన్న తరహ పరిశ్రమల ప్రాముఖ్యతపై ఆమె అవగాహన కల్పించారు. ప్రభుత్వం చిన్న పరిశ్రమలకు అందించే ప్రోత్సాహకాలు, రుణ సదుపాయాలు, మార్కెటింగ్ అవకాశాలపై వివరించారు. కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. చిన్న తరహా పరిశ్రమలు స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించడంతోపాటు యువతలో వ్యాపార దృక్పథాన్ని పెంపొందిస్తాయని చెప్పారు.

వివరిస్తున్న అధ్యాపకులు

'పెద్దపులి తిరుగుతోంది జాగ్రత్త'

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత తోటగొంది, ప్రాజెక్టు పరిసరాల్లో పెద్దపులి సంచారం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై పి.అప్పారావు సూచించారు. పులి సంచారం దృష్ట్యా ప్రజలు ఒంటరిగా అడవి, పొలాలు, ప్రాజెక్టు పరిసర ప్రాంతాలకు, నిర్మానుష్య ప్రాంతాలకు వెళ్ల వద్దని చెప్పారు. పశువులను ప్రాజెక్టు సమీపంలో విడిచిపెట్టవద్దని హెచ్చరించారు. పెద్దపులి పాదముద్రలు లేదా సంచారం గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై విజ్ఞప్తి చేశారు.

అనధికారిక పొగాకు బ్యారన్లు నిర్మించొద్దు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: పొగాకు బోర్డులో నమోదు కాని రైతులు పొగాకు పంట సాగు చేయవద్దని 18వ నంబరు వేలం కేంద్రం నిర్వహణాధికారి వై.ప్రశాంత్ సూచించారు. మండలంలోని శ్రీనివాసపురంలో సోమవారం పొగాకు రైతులతో నిర్వహించిన సమావేశంలో ప్రశాంత్ మాట్లాడుతూ రైతులు ఎవరూ కొత్తగా అనధికారిక బ్యారన్లు నిర్మించకూడదన్నారు. ఎవరైనా అనధికారిక బ్యారన్లు కడితే వారి రిజిస్ట్రేషన్ నిలుపుదల చేస్తామని హెచ్చరించారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లు ప్రభాకర్‌రెడ్డి, లావణ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ చెట్లకు ఎరువుగా కోకో డొప్పలు

కామవరపుకోట, న్యూస్‌టుడే: కామవరపుకోట మండలంలో ఆయిల్ పామ్, కోకో పంటలు అధిక విస్తీర్ణంలో సాగవుతున్నాయి. రైతులు ఈ వాణిజ్య పంటలకు రసాయన ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ సాగుపై ఇటీవల మొగ్గు చూపుతున్నారు. ప్రధానంగా పామాయిల్ చెట్లకు బలం అందించేందుకు గింజలు తీసిన కోకో కాయల డొప్పలు ఎరువుగా తయారుచేసి వినియోగిస్తున్నారు. గింజలు తొలగించిన అనంతరం మిగిలిన డొప్పలను కుళ్ల పెట్టేందుకు ముందుగా గోతిలో వేస్తున్నారు. వాటిపై పేడను పరచి నిల్వ ఉంచుతున్నారు. ఈ విధంగా ఆరు నెలలపాటు నిల్వ ఉంచిన డొప్పలు కుళ్లి ఎరువుగా మారుతుంది. అనంతరం ఆయిల్‌పామ్ తోటలకు ఎరువుగా వినియోగిస్తున్నారు.

తెదేపా నాయకుడి చొరవతో రోడ్డుకు మరమ్మతులు

గుంతల తవ్వకాన్ని పరిశీలిస్తున్న వినోద్

ముదినేపల్లి, న్యూస్‌టుడే: దశాబ్ద కాలంగా కనీసం అభివృద్ధికి నోచుకోని వడాలి- తాడినాడ రహదారిపై పెద్ద పెద్ద గుంతలు పడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పెదకామనపూడి నుంచి చిగురుకోట వరకు సుమారు అయిదు కి.మీ. మేర చినుకుపడితే మడుగులను తలపిస్తున్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు అనేక సార్లు సమస్యను తెదేపా నియోజకవర్గ కోకన్వీనర్, పర్యాటకాభివృద్ధి సంస్థ రాష్ట్ర డైరెక్టర్ కొడాలి వినోద్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సొంత ఖర్చులతో గుంతలను సోమవారం సరిచేయించారు. గోతులు ఉన్నచోట జీఎస్బీ మెటల్‌తో మెరక చేయనున్నట్లు ఆయన చెప్పారు.

LIC 70వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
ఖాతాదారులకు విశేష సేవలందిస్తూ గత 70 సం॥లుగా మీ భవిష్యత్తు మా బాధ్యత అనే నినాదంతో ముందుకు వెళుతూ 70 సం॥లు పూర్తి చేసుకున్న సందర్భంగా, LIC పాలసీదారులకు, బంధుమిత్రులకు, శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలు.

వేమూరి శ్రీనివాసరావు
ఛీప్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వయిజర్
జంగారెడ్డిగూడెం, 96661 88345

LIC 70వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
ఖాతాదారులకు విశేష సేవలందిస్తూ గత 70 సం॥లుగా మీ భవిష్యత్తు మా బాధ్యత అనే నినాదంతో ముందుకు వెళుతూ 70 సం॥లు పూర్తి చేసుకున్న సందర్భంగా LIC పాలసీదారులకు, బంధుమిత్రులకు, శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలు.

K.V.D.S.R.ప్రసాద్ M.Com
సీనియర్ చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వయిజర్
జంగారెడ్డిగూడెం. 94403 89800

పదవీవిరమణ శుభాకాంక్షలు

శ్రీమతి & శ్రీ అత్తులూరి అమ్మిరాజు గారు, B.A.
సెక్రటరీ: గ్రేడ్-I, యర్నగూడెం గ్రామ పంచాయతీ
గత 35 సం॥రాలుగా పంచాయతీరాజ్ శాఖలో అవిశ్రాంత సేవలందించి అధికారుల మన్ననలను పొంది, ది.31-08-2026న పదవీవిరమణ చేసిన మా మార్గదర్శకులు శ్రీ అత్తులూరి అమ్మిరాజు గార్కి ఇవే మా హార్దిక శుభాకాంక్షలు. మీ శేష జీవితం ఆనందమయం కావాలని ఆకాంక్షిస్తూ..
భార్య: శ్రీమతి వెంకటరమణ
పెద్ద కుమారుడు: జయవీరవెంకట గంగాధర్, M.Tech., CS కోడలు: సౌజన్య, M.A., B.Ed.
మనుమడు: హిమసాయి అఖిల్‌వర్మ
చిన్నకుమారుడు: మోహన లక్ష్మీకాంత్, B.Tech. కోడలు: భార్గవి, B.Sc. Computers
మనుమడు: A.P.S.V.G.అక్షిత్‌వర్మ
చెల్లెలు: విస్సా కనకదుర్గాభవాని

(c) eenadu

నూజివీడు

• నూజివీడు • కైకలూరు

నేడు సామూహిక కుంకుమ పూజలు

కైకలూరు, న్యూస్‌టుడే: శ్రావణ మాస మహోత్సవాల్లో భాగంగా కైకలూరు ప్రాంత ప్రజల ఆరాధ్య దేవత శ్రీశ్యామలాంబ అమ్మవారి దేవస్థానంలో మంగళవారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు దేవస్థాన ఈవో వై. శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి నిర్వహించే కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

గణేశ్ నవరాత్రులకు రాట ప్రతిష్ఠ

ముదినేపల్లి, న్యూస్‌టుడే: శ్రీహరిపురంలో ఈనెల 14 నుంచి నిర్వహించే గణేశ్ నవరాత్రుల ఉత్సవాల పనుల ప్రారంభానికి సోమవారం రాట ప్రతిష్ఠ నిర్వహించారు. మాజీ సర్పంచి పరసా విశ్వేశ్వరరావు, కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నేడు ఆక్వా రైతు సమస్యల పరిష్కార వేదిక

కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరు, కలిదిండి మండలాల ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై మంగళవారం సాయంత్రం 4 గంటలకు కైకలూరు తహసీల్దార్ కార్యాలయంలో రైతు సమస్యల పరిష్కార వేదిక ఏర్పాటు చేస్తున్నట్లు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి గణపతి సోమవారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.1.50కే విద్యుత్తు రాయితీ అందిస్తున్న తరుణంలో అధిక శాతం అప్పుడా రిజిస్ట్రేషన్లు నమోదు చేసుకోలేదని, కొన్ని గ్రామాల్లో రెవెన్యూ సమస్యలు అడ్డంకిగా మారాయని చెప్పారు. ఈ సమస్యలను రెవెన్యూ, మత్స్యశాఖ అధికారుల సమక్షంలో పరిష్కరించుకునేందుకు రైతులు తరలిరావాలని కోరారు. సమావేశానికి వచ్చే రైతులు చెరువు పత్రాలు, ఆధారు కార్డు, శిస్తు రసీదులు, కరెంటు బిల్లులు వెంట తీసుకురావాలని సూచించారు.

ఎలక్ట్రికల్ బెడ్, వీల్ చైర్ బహూకరణ

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడు నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వ నిధులతో పాటు వ్యక్తిగతంగా తన వంతు సహకారాన్ని అందిస్తున్నారు మంత్రి కొలుసు పార్థసారథి. తన తండ్రి పెద రెడ్డయ్య చారిటబుల్ ట్రస్టు ద్వారా నూజివీడు ప్రభుత్వ ఆస్పత్రికి రూ.లక్ష విలువైన ఎలక్ట్రిక్ బెడ్, వీల్ చైర్‌లను సమకూర్చారు. ఈ మేరకు సోమవారం తన ప్రతినిధుల ద్వారా ఆస్పత్రికి పంపించగా.. సూపరింటెండెంట్ పద్మజ రాణి, ఆర్ఎంవో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రికి ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది, రోగులు కృతజ్ఞతలు తెలిపారు.

తెదేపా నాయకుడి చొరవతో రోడ్డుకు మరమ్మతులు

పొక్లెయిన్‌తో గుంతలు సరిచేయిస్తున్న వినోద్

ముదినేపల్లి, న్యూస్‌టుడే: దశాబ్ద కాలంగా కనీసం అభివృద్ధికి నోచుకోని వడాలి-తాడినాడ రహదారిపై పెద్ద పెద్ద గుంతలు పడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పెద కామనపూడి నుంచి చిగురుకోట వరకు సుమారు అయిదు కి.మీ. మేర చినుకుపడితే మడుగులను తలపిస్తున్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు అనేక సార్లు సమస్యను తెదేపా నియోజకవర్గ కోకన్వీనర్, పర్యాటకాభివృద్ధి సంస్థ రాష్ట్ర డైరెక్టర్ కొడాలి వినోద్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సొంత ఖర్చులతో గుంతలను సోమవారం పొక్లెయిన్‌తో సరిచేయించారు. గుంతలుగా ఉన్నచోట జీఎస్బీ మెటల్‌తో మెరక చేయనున్నట్లు ఆయన చెప్పారు.

రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి

పనులు ప్రారంభించిన నాయకులు

ముసునూరు, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెదేపా మండలాధ్యక్షుడు గద్దె రఘు, గ్రామ అధ్యక్షుడు మందలపు ధర్మరాజు అన్నారు. ముసునూరు మండలం గుడిపాడులో మూడు కి.మీ. తారు రోడ్డు నిర్మాణానికి మంత్రి కొలుసు పార్థసారథి రూ.1.15 కోట్లు మంజూరు చేయించారు. ఈ పనులను సోమవారం నాయకులు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో కొల్లి గంగారాం, కృష్ణయ్య, మందలపు భాను తదితరులు పాల్గొన్నారు.

ఎలా పట్టుకెళ్లాలి పుస్తకాలు

☛ విద్యార్థి మిత్ర కిట్లలో లోపించిన నాణ్యత

నూజివీడు, న్యూస్‌టుడే:

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రోత్సాహకంగా రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్ల నాణ్యత తీసికట్టుగా మారింది. పంపిణీ చేసిన నెల రోజుల వ్యవధిలోనే సంచుల డొల్లతనం బయటపడింది. చిరిగిపోవడం, జిప్పులు, హ్యాండిళ్లు ఊడిపోయి కనిపిస్తున్నాయి. వీటి నాణ్యత చూసి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సైతం విస్తుపోతున్నారు. పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చిస్తుంటే గుత్తేదారుల నిర్లక్ష్యంతో ఈ పరిస్థితి ఏర్పడిందని పలువురు వాపోతున్నారు.

● చొప్పరమెట్లకు చెందిన విద్యార్థి ఏడో తరగతి చదువుతున్నాడు. ఆ విద్యార్థికి ఇచ్చిన పుస్తకాల సంచి కేవలం 20 రోజుల్లోనే చిరిగిపోయింది. చిన్న ఆగిరిపల్లికి చెంది ఓ విద్యార్థి ఆగిరిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. నెలరోజుల్లోనే ఆ విద్యార్థి బ్యాగ్ చిరిగిపోవడంతో బయట మార్కెట్‌లో కొత్త బ్యాగ్ కొనాల్సి వచ్చింది.

పర్యవేక్షణ లోపించి..

విద్యార్థి మిత్ర కిట్టులో పాఠ్య, రాత పుస్తకాలు, ఆక్స్‌ఫర్డ్ నిఘంటువు, మూడు జతల ఏకరూప దుస్తులు, బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్టు ఉంటాయి. రాష్ట్ర వ్యాప్తంగా టెండర్ పొందిన గుత్తేదారు పాఠశాలలు తెరచేపాటికి వీటిని సరఫరా చేయలేక చేతులెత్తేశారు. ఎట్టకేలకు నెల రోజుల క్రితం ఈ కిట్లు పంపిణీ చేశారు. అధికారులు కిట్ల నాణ్యతను పూర్తి స్థాయిలో పర్యవేక్షించకపోవడంతో లోపాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి.

ఆగిరిపల్లిలో చిరిగిన సంచి చూపుతున్న విద్యార్థులు

సొంతవే దిక్కయ్యాయి..

నియోజకవర్గంలో నాలుగు మండలాలకు సంబంధించి 261 పాఠశాలలు ఉండగా ఒకటి నుంచి పదో తరగతి వరకు 14,866 మంది విద్యను అభ్యసిస్తున్నారు. వీరంతా నాసిరకమైన బ్యాగుల్లోనే పుస్తకాలు తెచ్చుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మరికొందరు వాటిని పాఠశాలల్లోనే ఉంచి స్పేర్ బ్యాగులుగా వినియోగిస్తున్నారు. ఈ కారణంగా ప్రభుత్వ లక్ష్యం నెరవేరక తల్లిదండ్రులపై అదనపు భారం తప్పడం లేదు.

ఉన్నతాధికారుల దృష్టికి..

బ్యాగులు ఇచ్చే ముందు అన్నింటినీ పరిశీలించి ఇచ్చాం. పుస్తకాల బరువు ఎక్కువ కావడం, విద్యార్థులు వాటిని సరిగ్గా వినియోగించకపోవడంతో అవి పాడవుతున్నాయి. పుస్తకాల సంచుల నాణ్యత విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతాం.

- పి.ఎస్.సుధాకర్, డీవైఈవో, నూజివీడు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నూజివీడు	:80085 74698	ఆగిరిపల్లి	:92940 00369
ముసునూరు	:93983 81268	చాట్రాయి	:80085 74700
కైకలూరు	:73060 88555	మండవల్లి	:81060 99008
కలిదిండి	:90594 84862	ముదినేపల్లి	:80085 74693

కైకలూరు, న్యూస్‌టుడే: ? కైకలూరు బస్ స్టాండు అవుట్ గేటు ఎదురుగా జాతీయ రహదారిపై డ్రెయినేజీ నీరు తిష్ఠ వేసింది. వాహనాల వేగానికి నీరు వ్యాపార దుకాణాలపై పడుతున్నాయి. **- రామకృష్ణ, వ్యాపారస్థుడు**

✔ మురుగు నీరు మరలించి సమస్యను పరిష్కరిస్తాం.

-శ్రీరంగం, శానిటరీ అధికారి, కైకలూరు

కలిదిండి, న్యూస్‌టుడే: ? కోరుకొల్లు ప్రధాన కూడలి నుంచి ఆవకూరు వెళ్లే మార్గంలో రహదారి పక్కన వాహనాలు నిలిపి వేస్తుండటంతో సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. **-కిరణ్, కోరుకొల్లు**

✔ రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటాం.

- పవన్ కుమార్, పంచాయతీ కార్యదర్శి

రెండేళ్ల పాలనలో అభివృద్ధి పరుగులు

బైరవపట్నం ప్రచారంలో పాల్గొన్న నాయకులు

మండవల్లి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెట్టినట్లు తెదేపా నాయకులు తెలిపారు. మండవల్లి మండలం భైరవపట్నం 19వ వార్డు బూత్ కన్వీనర్ బొల్లెంపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో రెండేళ్ల పాలనపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మారుమూల ప్రాంతాల వరకు రోడ్లు నిర్మించిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కూనపరెడ్డి కోటేశ్వరరావు, తలారి రాజేశ్, నారగాని సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను సస్యశ్యామలం చేస్తాం: కామినేని

కూటమి శ్రేణులతో కలిసి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

కలిదిండి, న్యూస్‌టుడే: ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ఆదర్శంగా తీర్చిదిద్ది సస్యశ్యామలం చేయాలనే సంకల్పంతో పనిచేస్తున్నామని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. మండలంలోని అమరావతి-కొండంగి, మూలలంక- చిన్న పుట్లపూడి రోడ్ల నిర్మాణ పనులకు సోమవారం కూటమి శ్రేణులతో కలిసి భూమి పూజ నిర్వహించారు. గత వైకాపా పాలకులు సృష్టించిన విధ్వంసాల నుంచి రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తోందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సీసీ రోడ్లు నిర్మించామని, రానున్న రోజుల్లో నూరుశాతం పూర్తి చేసి మట్టి రోడ్లు లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో పలు కార్పొరేషన్ల రాష్ట్ర డైరెక్టర్లు నల్లగోపుల చలపతి, అంద్రాజు శ్రీనివాసరావు, లంకా రత్నారావు, అన్నవరం దేవస్థాన ట్రస్టు బోర్డు సభ్యురాలు బండి లక్ష్మి, ఏఎంసీ ఛైర్మన్ కురేళ్ల ఏడుకొండలు, తెదేపా మండల మాజీ అధ్యక్షుడు పోకల జోగిరాజు తదితరులు పాల్గొన్నారు.

పల్లెపల్లెకూ మోదీ అభివృద్ధి సందేశం

కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కైకలూరు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పల్లెపల్లెకు, గడపగడపకు తీసుకువెళ్లి అవగాహన కల్పిస్తామని భాజపా జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణ అన్నారు. ముదినేపల్లిలోని భక్తాంజనేయస్వామి ఆలయంలో ప్రధాని నరేంద్ర మోదీ, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కైకలూరు అభివృద్ధిపై ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. పల్లెపల్లెకు, ఇంటింటికీ వెళ్లి అభివృద్ధి పథకాలను వివరిస్తామన్నారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చిట్టూరి రవీంద్ర, సీనియర్ నాయకుడు కోకా శ్రీనివాసరావు, మండలాధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మి, మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, అంకాల దుర్గాప్రసాద్, వత్తుమిల్లి ప్రసాద్, మొవ్వా ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

లోకుమూడిలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్సై

మండవల్లి, న్యూస్‌టుడే: వాహన దారులు నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని ఎస్సై రామచంద్రరావు హెచ్చరించారు. లోకుమూడి సెంటర్లో సోమవారం వాహన తనిఖీలు నిర్వహించారు. శిరస్త్రాణం లేకపోవడంతోనే అనేక ప్రమాదాల్లో ద్విచక్ర వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అతి వేగం, సామర్థ్యానికి మించిన బరువు, నిబంధనలు పాటించకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

తెరచుకున్న నిఘా నేత్రాలు

ముదినేపల్లి వైజంక్షన్‌లో ఏర్పాటు చేస్తున్న కెమెరాలు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన ముదినేపల్లిలో జాతీయ రహదారి 165పై సీసీ కెమెరాలు ఎట్టకేలకు ఏర్పాటు చేశారు. రహదారి విస్తరణ పనుల్లో భాగంగా సుమారు ఏడాది కిందట వీటిని తొలగించారు. అప్పటి నుంచి నిఘా కుంటుపడింది. కెమెరాలు లేకపోవడంతో ప్రమాదాలకు కారణమైన వాహనాలను గుర్తించడం పోలీసులకు సవాల్‌గా మారింది. ముదినేపల్లి వైజంక్షన్‌లో, బస్ స్టాండు వద్ద రెండు రోజులుగా సీసీ కెమెరాలను తిరిగి అమర్చారు. దీంతో నిఘా పెరిగి ప్రమాదాలు, దొంగతనాలకు అడ్డుకట్ట పడటంతో పాటు కేసులు సకాలంలో ఛేదించవచ్చని పోలీసులు చెబుతున్నారు.

కాలనీ కష్టాలు తీరేదెన్నడు?

ప్రధాన రహదారి ఇలా..

మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి మండలం పెరికెగూడెం పేదల కాలనీలో ఏళ్లుగా వేధిస్తున్న కష్టాలకు మోక్షం కలగడం లేదు. గత ప్రభుత్వ హయాంలో 150 మందికి ఊరుచివర పొలాల్లో స్థలాలను కేటాయించారు. ఇళ్లను నిర్మించకపోతే వాటిని లాగేసుకుంటామని అధికారులు హెచ్చరించడంతో 80 కుటుంబాలు రూ.లక్షల్లో అప్పు చేసి ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. కనీసం లోడుతో ట్రాక్టర్లు వచ్చే వీలు లేకపోవడంతో చాలా దూరం వరకు ఇసుక, సిమెంట్, రాళ్లు మోసుకుంటూ వెళ్లి మరీ ఇళ్లను కట్టుకున్నారు. దాదాపు 40 ఇళ్ల నిర్మాణం పూర్తవ్వడంతో లబ్ధిదారులు గృహప్రవేశాలు చేసి అందులోనే నివాసం ఉంటున్నారు. కాలనీలు ఏర్పాటు చేసి మూడేళ్లు గడిచిపోతున్నా నేటికి కనీస వసతులు కల్పించకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సమస్యల తిష్ఠ

కాలనీలో వీధి దీపాలు లేకపోవడంతో ప్రజలు అంధకారంలో మగ్గిపోతున్నారు. మరోపక్క పంచాయతీ సరఫరా చేస్తున్న నీరు సైతం కలుషితంగానే ఉంటోంది. కనీసం స్నానాలు చేసుకోలేకపోతున్నామని స్థానికులు చెబుతున్నారు. చిన్నపాటి వర్షానికే రోడ్లు బురద కయ్యల్లామారుతోంది. రాత్రివేళలో పురుగులు, పాములు ఇళ్లలోకి చేరుతున్నాయని గృహిణులు తూము సోమేశ్వరమ్మ, కత్తిక వరలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం రోడ్లను మట్టితో మెరక చేసి డ్రెయినేజీలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. దీనిపై ఈవోపీఆర్డీ లక్ష్మీనారాయణను సంప్రదించగా పంచాయతీ ఆధ్వర్యంలో రోడ్డు మెరక చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇతర సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు.

పనులు పూర్తయినా.. ప్రారంభానికి నోచుకోలేదు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాల్లో ప్రజల తాగు నీటి అవసరాలను తీర్చేందుకు రూ.కోట్లు వెచ్చిస్తున్నాయి. కానీ కొన్నిచోట్ల పనులు పూర్తయినా ప్రారంభోత్సవానికి నోచుకోవడం లేదు. నూజివీడు మండలం ఓగిరాలతండాలో రూ.27.90 లక్షలతో 30 వేల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకు, బోరు, మోటారు, పైప్‌లైను, విద్యుత్తును ఏర్పాటు చేశారు. ఈ పనులను జులై 2025న ప్రారంభించి ఈ ఏడాది జనవరిలో పూర్తి చేశారు. కానీ ఇప్పటికీ వాటిని ప్రారంభించేందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ నూజివీడు ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ ఎం.చిట్టిబాబును సంప్రదించగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

కిసాన్‌మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడిగా శ్రీనివాసరావు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: భాజపా కిసాన్ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడిగా ఆగిరిపల్లి మండలం శోభనాపురం గ్రామానికి చెందిన ఈతాకుల శ్రీనివాసరావును నియమించినట్లు ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు కీర్తి వెంకట రామ్ ప్రసాద్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ తనకు పదవి రావడానికి కృషి చేసిన రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి, రాష్ట్ర కార్యదర్శి దొడ్డా నాగరాజు, భాజపా జిల్లా అధ్యక్షుడు విక్రం కిశోర్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు వెంకట రామ్ ప్రసాద్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

అంకితభావంతో సేవలు

పుష్పవతి దంపతులను సత్కరిస్తున్న ఎంఈవో రామారావు, ఉపాధ్యాయులు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: విద్యాభివృద్ధికి ముదినేపల్లి తూర్పు పాఠశాల ఉపాధ్యాయురాలు పుష్పవతి అంకితభావంతో పనిచేశారని ఎంఈవో-1 రామారావు అన్నారు. పుష్పవతి ఉద్యోగ విరమణ సందర్భంగా ముదినేపల్లిలో సోమవారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం పుష్పవతి దంపతులను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నారాయణదాసు, నాయకులు బేతాళ రాజేంద్రప్రసాద్, వెంకటరత్నం, జాన్సన్‌బాబు పాల్గొన్నారు.

✦ పెదకామనపూడి ఉపాధ్యాయుడు బొడ్డు పాండురంగారావు, ముదినేపల్లి ఉపాధ్యాయురాలు పుష్పవతి ఉద్యోగ విరమణ సందర్భంగా వారిని యూటీఎఫ్, ఎస్టీయూ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. యూటీఎఫ్ మండలాధ్యక్షుడు కట్టా యశోదకృష్ణ, కార్యదర్శి సింహాచలం, ఎస్టీయు మండలాధ్యక్షుడు అనగాని మల్లేశ్వరరావు, కార్యదర్శి మోత్కూరి నాగరాజు పాల్గొన్నారు.

అర్హులైన ఆక్వా రైతులందరికీ రాయితీ

ముదినేపల్లి, న్యూస్‌టుడే: రెవెన్యూ సమస్యలతో ఆక్వా రైతులు విద్యుత్తు రాయితీ కోల్పోకుండా సకాలంలో పరిష్కరించాలని ఆర్డీవో లక్ష్మీప్రసన్న సూచించారు. ముదినేపల్లి మండల రెవెన్యూ కార్యాలయం వద్ద సోమవారం సాయంత్రం రెవెన్యూ, మత్స్యశాఖల ఆధ్వర్యంలో ఆక్వా రైతుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని సూచించారు. కైకలూరు ఏఎంసీ ఛైర్మన్ పెన్మెత్స త్రినాథ్‌రాజు మాట్లాడుతూ రీసర్వే సమయంలో తప్పిదాలతో వాస్తవ విస్తీర్ణాలు తగ్గడంతో ఆక్వా రైతులు రాయితీ కోసం దరఖాస్తు చేసుకోలేకపోతున్నారని తెలిపారు. రీసర్వేలో తనకు ఎకరం తగ్గిందని పేరూరుకు చెందిన కొలుసు జగన్మోహన్‌రావు చెప్పారు. ప్రైవేటు సర్వేయర్లతో చేయిస్తే ఎక్కువ విస్తీర్ణం వస్తుందని తెలిపారు. ఈ సమావేశం గురించి ఎవరికీ సమాచారం ఇవ్వకపోవడంతో పది మంది లోపు రైతులు సమావేశానికి హాజరయ్యారు. మత్స్యశాఖ ఏడీఏ ఎం. రవికుమార్, తహసీల్దార్ లతీఫ్ పాషా, రీసర్వే డీటీ యు.ప్రసాద్, సర్వేయర్ రాజశేఖర్‌రెడ్డి, ముదినేపల్లి, మండవల్లి మండలాల ఎఫ్‌డీవోలు సతీశ్‌కుమార్, బి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

వీధి దీపాలు ఏర్పాటు చేయాలని వినతి

మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లిలో వీధి దీపాలు వెలిగించేలా చర్యలు తీసుకోవాలంటూ ప్రజాస్వామ్య ఐక్యవేదిక సభ్యులు సోమవారం పీజీఆర్ఎస్‌లో డీటీ ఎమిలీకుమారికి వినతి పత్రాన్ని అందించారు. మూడేళ్లుగా జాతీయరహదారి 165 విస్తరణలో రోడ్డు వెంబడి విద్యుత్తు దీపాలు తొలగించినట్లు తెలిపారు. అనంతరం ప్రతికల్లో కథనాలు, నాయకుల చొరవతో వీధిదీపాలు, విద్యుత్తు నియంత్రికను ఏర్పాటు చేసినా.. వాటికి కనెక్షన్ ఇచ్చేందుకు అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దీంతో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రప ఐక్యవేదిక సభ్యులు భాస్కరరావు, అప్పారావు, ముసలయ్య, వెంకటేశ్, పోతురాజు పాల్గొన్నారు.

వీధుల్లో శునకాలతో ప్రజల్లో గుబులు

చాట్రాయి, న్యూస్‌టుడే: శునకాల బెడదతో గ్రామాల్లో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చాట్రాయి మండలంలో ఏ గ్రామంలో చూసినా పదుల సంఖ్యలో గుంపులుగా సంచరిస్తున్నాయి. ప్రధాన రహదారులపై చేరి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. రాత్రి సమయాల్లో బయటకు రావాలంటే కర్ర చేతిలో లేకుండా వచ్చే పరిస్థితి లేదు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారిని వెంబడిస్తున్నాయి. ఇవి దాడి చేస్తాయనే భయంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇక చిన్న పిల్లలు, వృద్ధులు, మహిళలను భయపెడుతున్నాయి. అత్యవసర సమయాల్లో బయటకు రావాలంటే ఇద్దరు ముగ్గురు కలిసి రావాల్సి వస్తోందని వివిధ గ్రామాల ప్రజలు వాపోతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నారులను తల్లిదండ్రులు తీసుకు వెళ్లి, మళ్లీ తీసుకు రావాల్సి వస్తోంది. ఉదయపు నడక, వ్యాయామానికి వెళ్తున్న వారి వెంట పడుతున్నాయి. వీటిపై చర్యలకు అధికారులు వెనుకాడుతున్నారు.

ఖైదీల ఆరోగ్య సమస్యలపై ఆరా

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: కృష్ణాజిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎస్.వరలక్ష్మి నూజివీడు సబ్ జైలును సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీల కేసులు, వారి ఆరోగ్య సమస్యల గురించి ఆరా తీశారు. జైలులో ఏమైనా సమస్యలున్నాయా అని అడిగారు. రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రావణి, సబ్‌జైలు సూపరింటెండెంట్ జి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చేప పిల్లల నాణ్యత పరిశీలించిన తెలంగాణ అధికారులు

కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరు ప్రాంతం నుంచి తెలంగాణ రాష్ట్రానికి ఎగుమతి చేసే చేప పిల్లల నాణ్యతను ఆ రాష్ట్ర మత్స్యశాఖ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు సోమవారం తనిఖీ చేశారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం జనగామ జిల్లాలోని చెరువులకు చేప పిల్లలను సరఫరా చేసేందుకు టెండరు నిర్వహించగా.. కైకలూరు పరిసర ప్రాంతాలకు చెందిన కొందరు ఆక్వా రైతులు దక్కించుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారి మాచన రఘునందన్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ సూచనలతో ఆయన ఆధ్వర్యంలోని తనిఖీ బృందం కైకలూరు పట్టణంలోని ఆక్వా రైతులకు చెందిన చెరువుల్లో చేప పిల్లలను పరిశీలించి నాణ్యతా పరీక్షలు నిర్వహించారు. మరో రెండు రోజుల పాటు ఇతర రైతులకు చెందిన చెరువుల్లోని చేప పిల్లలను సందర్శించి పలు రకాల పరీక్షలు జరిపి నాణ్యమైన పిల్లలను తరలించేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 64 దరఖాస్తులు

ఏవోకు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడు సబ్‌కలెక్టరు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో మొత్తం 64 దరఖాస్తులందాయి. కార్యాలయ ఏవో ఎం.ఉమామహేశ్వరరావు అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. రామన్నగూడెం రహదారిలో ఉన్న శ్మశానవాటికకు కనీస సౌకర్యాలు కల్పించి అభివృద్ధి చేయాలని భాజపా నాయకుడు మల్లెపూడి రాజశేఖర్ విజ్ఞప్తి చేశారు. క్రీడారంగం అభివృద్ధికి స్పోర్ట్స్ మల్టీ కాంప్లెక్స్ నిర్మించాలన్నారు. ✦ వెంకటాద్రిపురంలో శ్రామికులకు వీబీజీ రామ్‌జీ పథకంలో పనులు కల్పించాలని కోరారు. ✦ ముక్కొల్లుపాడులో ఏర్పాటు చేస్తున్న కోళ్ల ఫారాన్ని తొలగించాలని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ✦ కోతులు కుక్కల బెడద నుంచి పట్టణ ప్రజలను రక్షించాలని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి నాగేశ్వరరావు కోరారు.

నేడు ఆగిరిపల్లిలో మంత్రి పర్యటన

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: మంత్రి కొలుసు పార్థసారథి మంగళవారం ఆగిరిపల్లిలో పర్యటించనున్నారు. ఉదయం 7 గంటలకు ఆగిరిపల్లి యాదవ బజారులో 'ఎన్టీఆర్ భరోసా పింఛన్ల' పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు పింఛను అందజేస్తారని తెదేపా మండల అధ్యక్షుడు నక్కనబోయిన వేణు సోమవారం తెలిపారు.

డంపింగ్ యార్డు కాదు.. నివాస ప్రాంతమే!

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లి విశ్వబ్రాహ్మణ వీధి కరణంగారి బజారులో నివాస ప్రాంతాల్లో చెత్త, వ్యర్థాలను తొలగించక డంపింగ్ యార్డును తలపిస్తోంది. ఆ ప్రాంత ప్రజలు దుర్వాసనతో అవస్థలు పడుతున్నారు. నివాస ప్రాంతాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎంపీడీవో షేక్ అబ్దుల్ సలామ్ మాట్లాడుతూ... ప్రజలకు ఇబ్బంది లేకుండా నివాస ప్రాంతాల్లో చెత్తను తొలగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కరవు మండలంగా ప్రకటించాలి

నిరసన తెలుపుతున్న నాయకులు

ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు మండలాన్ని కరవు మండలంగా ప్రకటించాలని సీపీఐఎంఎల్ లిబరేషన్ మండల కార్యదర్శి వేముల బక్కయ్య డిమాండ్ చేశారు. సోమవారు ముసునూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐఎంఎల్ లిబరేషన్, అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం, ఏఐసీసీటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బక్కయ్య మాట్లాడుతూ అటవీ భూములకు ఇచ్చిన నాలుగో నోటిఫికేషన్ రద్దు చేసి, రమణక్కపేట సాగుదారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేసి పట్టాలు ఇవ్వాలన్నారు. గ్రామంలో రీసర్వే వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

పేదలకు అండగా మానవత

నిత్యావసర సరకులు అందిస్తున్న ప్రతినిధులు

మండవల్లి, న్యూస్‌టుడే: నిరుపేదలకు అండగా నిలిచి వారి అవసరాలు తీర్చటమే ధ్యేయంగా మానవత సంస్థ సేవలు అందిస్తోందని ఆ సంస్థ ఉమ్మడి కృష్ణాజిల్లా కెరీర్ గైడెన్స్ ఛైర్మన్ సుధాబత్తుల విజయ్‌కుమార్, పర్యావరణ పరిరక్షణ కమిటీ సభ్యుడు గుడివాడ గణేశ్ అన్నారు. స్థానిక నాగేంద్రస్వామి ఆలయం ఆవరణలో సోమవారం మానవత సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన డి.శ్రీనివాసరావుకు నిత్యావసర సరకులు అందించారు. కూనపరెడ్డి కోటేశ్వరరావు, బొల్లంపల్లి కృష్ణారావు, శ్రీనివాసరావు, రవి, రాఘవులు, సూరిబాబు పాల్గొన్నారు.

BEFORE THE HONOURABLE DEBTS RECOVERY TRIBUNAL AT VISAKHAPATNAM

S.A.540/2026

Between:

VUTUKURU SUREKHA RAJA RAJESHWARI ...Applicant

And

AUTHORISED OFFICER, State Bank of India, SAR Branch, Vijayawada & others ... Respondents

Def.Nos	Defendant Name
3.	**Smt. KATRENIPATI SUJATHA**, W/o. Ramgiri Ranga Babu, R/o. 11-34, Pathapet, Near Suthrala Rama Mandiram, Nuzividu, Krishna District, Andhra Pradesh.
4.	**Sri. RAMGIRI RANGA BABU**, S/o. R. Krishna Rao, R/o. 11/39, Musalarama Ramamandiram, Pathapeta, Nuzividu, Krishna District, Andhra Pradesh

SUMMONS BY PAPER PUBLICATION FOR SHOWING CAUSE AS TO WHY THE RELIEFS PRAYED FOR SHOULD NOT BE GRANTED

WHEREAS, S.A No.540/2026 was listed before Hon'ble Presiding Officer/Registrar on: 25.08.2026.

An application under section Section 17 [4A] OF THE SECURITISATION AND RECONSTRUCTION OF FINANCIAL ASSETS AND ENFORCEMENT OF SECURITY INTEREST ACT 2002 (SA) filed against you has been filed before this Tribunal.

Show cause as to why the relief prayed for should not be granted. You are required to file reply, if any, in your defence in the paper book form in two completed sets and produce all the documents and affidavit in your support in the Tribunal personally or through your duly authorized agent or legal practitioner and appear before This Tribunal on 25.09.2026 at 10.30 A.M. failing which the application shall be heard and decided in your absence. You are further directed to supply advance copy of the reply to the S.A to the counsel for the Applicant.

THE RESPONDENTS SHOULD APPEAR BEFORE THIS TRIBUNAL ON 25.09.2026

Given under my hand and the seal of this Tribunal on this date: 31.08.2026.

BY THE ORDER TRIBUNAL

SIGNATURE OF THE OFFICER / AUTHORISED PERSON

इंडियनऑयल IndianOil

వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు

ఇండియన్ ఆయిల్ వ్యవస్థాపక దినోత్సవ శుభసందర్భమున మా ఖాతాదారులకు ఇవే మా శుభాకాంక్షలు.

శివశక్తి ఫిల్లింగ్ స్టేషన్

ప్రొ: బడుగు రంగారావు, మీర్జాపురం, నూజివీడు మండలం

CELL: 96664 66937